తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## గౌరమ్మ గ్రామోత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 22 ప్రభాతవార్త
దక్షి కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల నెలా ఓ ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ధనుర్మాసం నెల రోజుల పాటు గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఆదివారం అమ్మవారు గొబ్బెమ్మగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో దేవేరిని కన్నుల పండువగా అలంకరించి బోయిలు మోసుకుంటూ శివయ్య మండపం నుంచి రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ నుంచి వాహనంపై అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు.

## డిఎంహెచ్ఓగా డాక్టర్ సుధారాణి బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ సుధారాణి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని డిఎంహెచ్ఓ ఛాంబర్లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల బదిలీలకు సంబంధించి చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రభావతి దేవిని రంపచోడవరం అడిషనల్ డిఎంహెచ్ఓగా బదిలీ చేస్తూ అలాగే చంద్రగిరి డిప్యుటీ డిఎంహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుధారాణికి చిత్తూరు జిల్లా డిఎంహెచ్ఓగా నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటి కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా డిఎంహెచ్ఓగా ఆదివారం డాక్టర్ సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. డిఎంహెచ్ఓగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సుధారాణిని అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

# ఒక్క రాకెట్ ప్రయోగం.. 24 పరిశోధనలు

### - షార్లో 99వ రాకెట్ ప్రయోగానికి సిద్ధం - మరో నెలరోజులు ఇస్రో శాస్త్రవేత్తలు బిజీబిజీ



శ్రీహరికోట (తడ), డిసెంబర్ 22 ప్రభాతవార్త
శ్రీహరికోట నుంచి ఈ నెల 30న ప్రయోగించనున్న పిఎస్ఎల్వి-సి60 రాకెట్ ద్వారా ఏకంగా 24 పరిశోధనలకు ఇస్రో సిద్ధమవుతోంది. ఒక్క రాకెట్ ద్వారా వంద ఉపగ్రహాలను గతంలో పంపించిన ఇస్రో ప్రస్తుతం రాకెట్లోని నాలుగవ దశతో విభిన్న పరిశోధనలకు శ్రీకారంచుడుతోంది. ఏకంగా 24 పరిశోధనలు ఈ పిఎస్-4 ద్వారా రాబట్టడానికి ఇస్రో కొన్ని ఉపకరణాలను ప్రవేశపెట్టనున్నట్లు ఆదివారం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పిఎస్ఎల్వి-సి60 రాకెట్ ద్వారా స్పెడెక్స్ ఉపగ్రహాలు కక్ష్యలోకి పంపిస్తున్నారు. వీటి ద్వారా ఇస్రోకు విలువైన సమాచారంతో పాటు భవిష్యత్లో జరిగే స్పేస్ స్టేషన్ నిర్మాణంలో కొన్ని పరిశోధనలను ఆశిస్తున్నారు. ఈ స్పెడెక్స్తో పాటు రాకెట్లోని నాలుగవ దశలో విభిన్న పరిశోధనలను చేపట్టడానికి ఇస్రో సిద్ధమైంది. ఇందులో 14 ఉపకరణాలు ఇస్రోవి కాగా, మరో 10 ఉపకరణాలు దేశంలోని వివిధ ప్రైవేటు స్టార్టప్ కంపెనీలు, విశ్వవిద్యాలయాల వారివి కావడం విశేషం. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) ద్వారా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారంచుడుతూనే ఉన్నారు. శాస్త్రవేత్తలు ప్రస్తుతం షార్ నుంచి ప్రయోగిస్తున్న 99వ రాకెట్ పిఎస్ఎల్వి-సి60 ద్వారా కూడా ఇటువంటి కొత్త పరిశోధనలను లక్ష్యంగా చేసుకున్నారు. నాలుగవ దశను పిఒఇఎంగా పేర్కొంటూ ఇప్పటికే కొన్ని రాకెట్ల ద్వారా అంతరిక్ష సమాచారాలు సేకరించారు. ప్రస్తుతం ఏకంగా 24 పరిశోధనలు చేపట్టడం, ఇస్రో తాను అభివృద్ధి చేసుకున్న సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనంగా పలువురు అంటున్నారు.

**30న రాకెట్ ప్రయోగం**

షార్ నుంచి ఈ నెల 30న రాత్రి 9.48 గంటలకు పిఎస్ఎల్వి-సి60 రాకెట్ ప్రయోగం జరపాలని ప్రస్తుతానికి సమయం కేటాయించినట్లు తెలిసింది. అయితే రాకెట్ ప్రయోగానికి రెండురోజులు ముందు సమయం నిర్ధారణ చేసే అవకాశం ఉంది. షార్లోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి ఈ ప్రయోగం చేపట్టనున్నారు. ఇప్పటికే పిఎస్ఎల్వి అనుసంధాన భవనంలో నిర్మాణం పూర్తి చేసుకొని ప్రయోగ వేదిక మీదికి రాకెట్ను చేర్చారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ ప్రయోగానికి రెండురోజులు ముందే షార్ను చేరుకొని అంతరిక్ష ప్రయోగాలపై సీనియర్ శాస్త్రవేత్తలతో సమావేశం కానున్నట్లు తెలిసింది. ఆయన ఆధ్వర్యంలోనే ఈ రాకెట్ ప్రయోగం జరగనుంది. పైగా, జనవరి 23న సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి భారత ప్రతిష్టాత్మక 100వ రాకెట్ జిఎస్ఎల్వి-ఎఫ్15 ప్రయోగించనున్నారు.

తిరుమల...

# ఇక ఆదర్శనగరం

### అలిపిరి వద్ద 40 ఎకరాల్లో బేస్క్యాంపు -ఆర్టీసి బస్టాండుల ఆధునీకరణ
### -విజన్ 2047 లక్ష్యాలు వెల్లడిలో టిటిడి ఈఓ శ్యామలరావు,అదనపు ఈఓ చౌదరి



తిరుమల, డిసెంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలను ఆదర్శనగరంగా తీర్చిదిద్దేందుకు తిరుమల విజన్ -2047 ప్రణాళికలు సిద్ధంచేసినట్లు టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ప్రణాళికా బద్ధంగా తిరుమలను అభివృద్ధి చేయనున్న అంశాలపై ఆదివారం ఉదయం అన్నమయ్య భవనంలో మీడియాప్రతినిధులకు వివరించారు. భక్తులకు మరింత నాణ్యంగా అన్నప్రసాదాలు, మెరుగైన వసతి కల్పన, మౌళిక సదుపాయాలు కల్పించడం ప్రధానమన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో భక్తులకు నిర్ణీత సమయంలో దర్శనం, వసతి అందించేలా చర్యలు చేపట్టడం, అలిపిరి వద్ద భక్తులకు వసతి కోసం 40 ఎకరాల్లో బేస్క్యాంపు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర విజన్ 2047కు అనుగుణంగా తిరుమల విజన్ అమలుచేస్తామన్నారు. రామ్భగీచ, బాలాజీ బస్టాండ్ల పునర్నిర్మాణం చేపట్టనున్నామన్నారు. మీడియా సమావేశంలో టిటిడి జెఈఓ గౌతమి, సివిఎస్ఓ శ్రీధర్, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమలు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ ముద్ర

- ఆకస్మిక తనిఖీలు,జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు
- విద్య,వైద్యం, ప్రజా సంక్షేమానికి పెద్దపీట
- ప్రజా సమస్యల పరిష్కార వేదికపై నిరంతర పర్యవేక్షణ
- ప్రభాతవార్త ప్రత్యేక కథనం



తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త :
తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుని 4 జూలై 2024 గురువారం రోజున తిరుపతి జిల్లా కలెక్టర్గా డాక్టర్ వెంకటేశ్వర్ పూర్తి బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి నేటి వరకు గత ఐదు నెలల 21 రోజుల కాలంలో తిరుపతి జిల్లాలోని ఏడు నియోజక వర్గాల అభివృద్ధిపై ఆయన యుద్ధ సైనికులా పనిచేస్తున్నారు. పేదల పెన్నిదిగా ఉంటూ విద్య, వైద్యం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పారిశ్రామిక, గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళుతున్నారు. జిల్లా అధికారులు క్రింది స్థాయి సిబ్బంది, ప్రజా ప్రతినిధుల సహకారం, సమన్వయంతో జిల్లాను ప్రగతి పథంలో నడిపేందుకు నడుం బిగించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వెలసిన తిరుపతి జిల్లాలో కలెక్టర్గా పనిచేయడం పూర్వ జన్మ సుకృతంగా భావించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందించేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రతి నెల 1 తేదిన నూటికి 98 శాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ద్వారా ప్రణాళిక బద్ధంగా చక్కగా ఇంటింటికి అందజేసిన ఘనత ఆయనకే దక్కింది. మరో పక్క ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల గ్రామీణ స్థాయి అధికారులు అందుబాటులో ఉండే విధంగా ఆయన చేస్తున్న కృషి అభినందనీయం. ఎప్పటికప్పుడు క్రింది స్థాయిలో డ్రైనేజీ కాలువల ఆకస్మిక తనిఖీలు ప్రతి వారం నిర్వహించే ఫ్రైడే డ్రై డే కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలతో మమేకమై వారి కష్టాలను స్వయంగా తెలుసుకుని అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల సమస్యలపై ఎప్పుకప్పుడు జిల్లా రెవెన్యూ మండల గ్రామీణ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్, సభలు సమావేశాలు ద్వారా వారికి ఆదేశాలు ఇస్తున్నారు.

# మహిళలు బలమైన శక్తిగా ఎదగాలి

### - సిఎం చంద్రబాబుసతీమణి నారా భువనేశ్వరి .. వి.కోటలో ఎన్టీఆర్ సుజల ప్లాంట్ ప్రారంభం



చెల్దిగానిపల్లిలో ప్రసంగిస్తున్న భువనమ్మ,వి.కోటలో ఎన్టీఆర్ సుజల ప్లాంట్ ప్రారంభిస్తున్న భువనమ్మ

వి.కోట/రామకుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త
మహిళలు బలమైన శక్తిగా ఎదగాలని సిఎం చంద్రబాబుసతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా ఆదివారం వి.కోట మార్కెట్యార్డ్లో హెరిటేజ్ సంస్థ సహకారంతో ఎన్టీఆర్ సుజల నీటి ప్లాంట్ను నారా భువనేశ్వరి ప్రారంభించారు. అంతకుముందు రామకుప్పం మండలం చెల్దిగానిపల్లిలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. తాను ప్రతి మూడు నెలలకు ఒసారి కుప్పం వస్తానన్నారు. అభివృద్ధి పనులను దగ్గరుండి చూసుకుంటానని ప్రజలకు సమస్యలు లేకుండా చూసుకోవడం తన బాధ్యత అన్నారు. ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైన్లు, అర్హులకు ఇళ్లు, ఉపాధి కల్పన అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కుప్పం నుంచి ఇక వలసలు ఉండవన్నారు. ఫుడ్ప్రాసెసింగ్ సహా మరిన్ని పరిశ్రమలు కుప్పానికి వస్తాయని స్థానికంగానే ఉపాధి లభిస్తుందన్నారు. ఇజ్రాయిల్ తరహా వ్యవసాయాన్ని దేశంలోనే మొదటిసారి కుప్పంలోనే సిఎం చంద్రబాబు పరిచయం చేశారని తద్వారా వ్యవసాయంలో పెద్ద విప్లవం తెచ్చారన్నారు.
మహిళలు శక్తిమంతులు : మహిళలు శక్తిమంతులు అని మగవారిని మించి పనిచేస్తారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు తెచ్చిన డ్వాక్రా సంఘాలతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నా న్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా తాము కూడా మహిళల స్వయం ఉపాధికి చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. వి.కోటలో గత ప్రభుత్వం హెరిటేజ్ వాటర్ ప్లాంట్ను కక్షపూరితంగా మూసివేసిందన్నారు. రామచంద్రనాయుడు సహకారంతో ఇప్పుడు మరలా ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు వి.కోట, చెల్దిగానిపల్లిలో నారా భువనమ్మకు తెదేపా నేతలు, మహిళలు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మాజీ ఎఎంసి ఛైర్మన్ రామచంద్రనాయుడు, రాష్ట్ర నేతలు డా॥ సురేష్బాబు, మునస్వామి, పత్ర నారాయణ, మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ఆనందరెడ్డి, నేతలు ఆంజనేయరెడ్డి, ఈశ్వర్, నరసింహులు, రామూర్తి, చిన్నికృష్ణ, చలపతి, సీతాపతి, రాంబాబు, ధీరజ్, భక్తవత్సలంనాయుడు, సోము, కోదండ, అమర, విజయ్కుమార్రెడ్డి, వెంకటరమణ, నందారెడ్డి, విశ్వనాథ్, సుబ్రి, ఆదిల్, నవీన్ పాల్గొన్నారు.

# వెలుగులో అవినీతి చీకట్లు మాయమైనట్లేనా?

### స్వాహాచేసిన నిధులను పట్టించుకోని అధికారులు-సోమవారం స్త్రీనిధి ప్రత్యేక బృందం రాక

తొట్టంబేడు, డిసెంబర్ 22 ప్రభాతవార్త
మండలంలోని వెలుగు కార్యాలయంలో అవినీతి చీకట్లు మాయమైనట్లేనా, స్వాహాచేసిన నిధులను రికవరీ చేయని అధికారులు ఇప్పటి వరకు వారు పట్టించుకోలేదంటే వారి పరిస్థితేంటో అర్థం కావడం లేదు. గతంలో ఎపిఎంగా ఉన్న గురుమూర్తి హయాంలో మండలంలోని ఒక్క చియ్యవరంలోని రూ.2.07కోట్లు ఈ గ్రామంలో సంఘమిత్రలుగా పనిచేస్తున్న మునిలక్ష్మి, మునిశేఖర్లు స్వాహాచేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో విషయం బయటపడడంతో పత్రికల్లో వార్తలు రావడంతో జిల్లా కలెక్టర్ స్పందించి ఇక్కడి పంచాయతీల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఒక్క చియ్యవరంలోనే కాకుండా గుండేలిగుంట, చోడవరం, కాసరం, రాంబట్లపల్లిలో ప్రత్యేక బృందాలు విచారణ చేసి తూతూ మంత్రగా వెళ్ళిపోయారు. ఒక్క చియ్యవరంలోనే మూడు గ్రమసంఘాలు ఉండగా 1,3 సంఘాల్లో మాత్రం అవినీతి అక్రమాలు జరిగాయి. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే సంఘమిత్రనే బ్యాంకు మిత్రగా ఉండడం గమనించదగ్గవిషయం దీంతో ప్రభుత్వం సొమ్మును స్వాహాచేశారంటే వారికి ఎంత మాత్రం భయం లేకపోవడం గమనార్హం. ఇవికాకుండా చేమూరు, కొండ్రాజుపల్లిలో కూడా విచారణల సాగాయి. స్వాహాచేసిన వారిని విచారించగా వారు ఒప్పుకోవడంతో ఇప్పటి వరకు రూ.60లక్షలు రికవరీచేశారు.

**కొత్తగా వచ్చాను.**
**.ఇంకా ఫైళ్ళు నావద్ద ఇవ్వలేదు..ఎపిఎం**

స్వాహాచేసిన నిధులపై కొత్తగా వచ్చిన ఎపిఎం ఇందిరాగాంధీని ప్రభాతవార్త వివరణ కోరగా ఇందుకు సంబందించి ఇప్పటి వరకు తనకు ఎలాంటి ఫైళ్ళు అందించలేదని విచారణాధికారులవద్ద నుంచి తీసుకుని సమగ్ర విచారణ చేసి స్వాహా చేసిన నిధులను జమచేసే విధంగా చేస్తామని తెలిపారు. సోమవారం స్త్రీనిధి ప్రత్యేక బృందం చియ్యవరం గ్రామానికి చేరుకుని సమగ్ర విచారణ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

# ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్ అమలు

### ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 22, ప్రభాతవార్త
ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన షేక్ చంపతి జాకీర్పై పిడీ ఆక్ట్ అములుకు టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ అధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, నమోదైన కేసులను నిరూపించే విధంగా దర్యాప్తు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఎర్రచందనం అక్రమ రవాణా దొంగగా 8 కేసుల్లో నిందితుడైన వైఎస్ఆర్ కడప జిల్లా, చాపాడు మండలం, ఖాదర్ వల్లి గ్రామంలో నివాసముండే, ఫక్రువల్లి కుమారుడు షేక్ చంపతి జాకీర్ (30) అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు సిఫార్సు మేరకు కడప జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం పీడీ ఆక్ట్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ వ్యక్తి విలువైన ఎర్రచందనాన్ని కొల్లగొడుతూ చట్టం పట్ల గానీ, అటవీ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరములు చేస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తున్నం దున ఇతనిపై టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారా యుడు ఆదేశాల మేరకు పీడీ ఆక్ట్ ఉత్త ర్వులు అమలులో భాగంగా, కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు హెచ్చరించారు. ఇప్పటికే కొంత మందికి ఐదేళ్ల కారాగార శిక్షలు పడిన విషయాన్ని గుర్తు చేశారు. వీటితో పాటు పీడీ యాక్ట్ కూడా అమలులోకి వస్తుందని తెలిపారు. అటవీ సంరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని, అరుదైన వృక్ష సంపద ఎర్రచందనాన్ని కాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు.

# వన్నికుల క్షత్రియ జాతి అభ్యున్నతికి కృషి చేస్తా

### చైర్మెన్ సిఆర్ రాజన్



తిరుపతిరూరల్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:
సమాజంలో వన్నికుల క్షత్రియులు సామాజికంగా ఆర్థికంగా వెనకబడి ఉన్నారని, ఆర్థికంగా సామాజకంగా, విద్యా పరంగా వన్నికుల క్షత్రియులు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వన్నికుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మెన్ డాక్టర్ సి.ఆర్.రాజన్ అన్నారు. వన్నికుల క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక యూత్ హాస్టల్లో జరిగింది. ఈ సమ్మేళనంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్రెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యులు భానుప్రకాష్రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఛైర్మెన్ డాక్టర్ సి.ఆర్.రాజన్ మాట్లాడుతూ వెనకబడియున్న వన్నికుల క్షత్రియులు ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని, బాధ్యతయుతంగా పోరాటం చేసి తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూటమి అభ్యర్థుల గెలుపులో ప్రధాన భూమిక పోషించింది వన్నికు క్షత్రియులనే విషయాన్ని గుర్తు చేసారు. ఎక్కువ శాతం వన్నికులయులు కుప్పం నియోజకవర్గంలో ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వన్నికుల క్షత్రియులను ఏకతాటిపై తీసుకొచ్చి వారి అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. వన్నికులస్తులు ఆర్థికంగా సామాజికంగా ఎదగాలంటే...దుర అలవాట్లకు దూరంగా ఉండటంతో పాటు విద్యా పరంగా ముందంజలో ఉండాలని సూచించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 అసెంబ్లీ సీట్లుకు గాను 12 గెలుపుకు కారణం వన్నికుల క్షత్రియులనే విషయాన్ని మరిచిపోరాదన్నారు. బి.ఉ.లలో వన్నికుల క్షత్రియుల అభ్యున్నతికి కో-ఆపరేటివ్ కార్పోరేషన్ ఏర్పాటు చేసారని, కార్పోరేషన్ను సద్వినియోగం చేసుకుని వన్నికులస్తులు సమాజంలో ముందు ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వన్నికుల క్షత్రియులను ఏకతాటిపై తీసుకురావటానికి త్వరలో తిరుపతిలో పెద్దసభను ఏర్పాటు చేస్తామని తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్రెడ్డి మాట్లాడుతూ తన గెలుపులో వన్నికుల క్షత్రియులు ప్రధాన పాత్ర పోషించారని, తన నియోజకవర్గంలో 70వేల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ సమ్మేళనంలో వన్నికుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పో రేషన్ డైరెక్టర్లు బాల సుబ్రమణ్యం అయ్యంగారు, జీపాళ్యం తేజోవతి, బి.రుద్రప్ప, భూపతి, సి,షణ్ముగం, డి.వి.అరుణాచలం, ఇ.ఎం.రాజేంద్రరెడ్డి, కె.ఎం.వేణుగోపాల్, ఎం.శ్రీనివాసులు, మినరల్ రవి, పి.మునిరత్నం రెడ్డి, పి,చిన్నపరెడ్డి, పెద్ద చిన్నప్ప వేమనమూర్తి, సెల్వం, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా

# ఆగని 'పశువుల పందేలు'

### సంక్రాంతిని కాదని ఆరు మాసాలు 'జల్లికట్టు సంబరాలు'
### రాయలపురంలో జల్లికట్టుకు పోటెత్తిన 'జనసందోహం'





చంద్రగిరి, డిసెంబర్ 22 ప్రభాతవార్త:
జల్లికట్టు సంబరాల పేరిట ఏటా జరుగుతున్న పశువుల పందేలలో ప్రాణాలు పోతున్నప్పటికీ పట్టించుకునే నాధుడే లేదని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మండల పరిధిలో ఆదివారం జల్లికట్టు సంబరాలు రాయలపురంలో సంక్రాంతికి ముందే ప్రారంభించారు. దీంతో సంక్రాంతి సమయంలో నిర్వహించాల్సిన జల్లికట్టు సంబరాలు మరో 6 మాసాల వరకు పల్లెల్లో నిర్వహించే విధంగా ప్రణాళికలు వేసుకుంటున్నారు. పశువుల పండుగ నేపథ్యాన్ని పరిశీలిస్తే.. ఏడాది పొడవునా తమకు సేధ్యంలో సాయంచేసి పండించిన పంటలను ఇంటికి చేర్చే పాడిపశువులను సంక్రాంతి సంబరాలలో భాగంగా మూడవ రోజు కనుమ పండుగనాడు మంచినీటితో శుభ్రంగా కడిగి ప్రత్యేక కొమ్ములకు రంగులద్ది పూజించి వాటిని జనం మధ్యలోకి వదలి సంబరాలు జరుపుకునే సంప్రదాయం వున్నది. అయితే మారిన పరిస్థితులలో యువకులు ఆర్థికంగా కొంత మేరకు బలోపేతం కావడంతో జల్లికట్టు సంబరాలు నిర్వహించడాన్ని ప్యాషన్గా తీసుకుంటున్నారు. ఇది సంప్రదాయ పండుగకు విరుద్ధంగా వివిధ ప్రాంతాల నుండి పశువులను తీసుకువచ్చి జల్లికట్టులో వదలిపెడుతున్నారు. ఈ క్రమంలో కొంత మంది వివిధ రూపాలలో తమ పశవులకు మత్తుని ఇచ్చి జనంలోకి వదలిపెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పశవులు విచక్షణను కోల్పోయి జనంపైకి రంకెలేస్తూ దూకుతూ తీవ్రంగా గాయపరచడం, ఏకంగా ప్రాణాలే తీసేయడం జరుగుతున్నది. చంద్రగిరి మండలంలో దాదాపు 10 పంచాయతీలలో ఈ జల్లికట్టు సంబరాలను ఏటా నిర్వహిస్తున్నారు. పోలీసులు ఎంత మొత్తుకున్నా పట్టించుకునే నాధుడేలేదు. గతంలో కొత్త శానంబట్ల, ఏ.రంగంపేట పంచాయతీలలో జరిగిన జల్లికట్టు సంబరాలలో చోటుచేసుకున్న ప్రమాదాలు, మరణాలను పరిగణలోకి తీసుకుని పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. రాయలపురంలో జరిగిన జల్లికట్టు సంబరాలలో పోటెత్తిన జనసందోహంలో 13 మంది గాయాలపాలయ్యారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జననాయకుడు టోల్‌ఫ్రీనెంబర్ ఆవిష్కరించిన నారా భువనమ్మ

కుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త



కుప్పం తెదేపా కార్యాలయంలో కార్యాలయంలో కొత్తగా ఏర్పాటుచేసిన జననాయకుడు గ్రీవెన్స్ సెల్‌కు సంబంధించిన టోల్‌ఫ్రీనెం 9640622226ను సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఆవిష్కరించారు. ఈసందర్భంగా గ్రీవెన్స్ విభాగంలో పనిచేసేవారు ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. అలాగే 35మందికి 85లక్షల మేర సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా.కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సలహాదారు నరేష్‌చారి, సిఎం పిఎ మనోహర్, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగ ం, నేతలు సత్యేంద్రశేఖర్, ప్రతాప్, కౌన్సిలర్లు సోమశేఖర్, ఎంఆర్ సురేష్, మహిళా నేతలు అనసూయ,భాగ్యలక్ష్మి త్రిలోక్,చంద్రకళ, తిరుమగళ్ పాల్గొన్నారు.

## వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



– వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మెన్ దేవళ్ల మురళి

**చిత్తూరురూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త:** వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలనీ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలనీ వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మెన్ దేవళ్ల మురళి డిమాండ్ చేసారు. ఆదివారం ఆయన చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏన్నో ఏళ్లు గడిచినా వడ్డెరుల జీవితాల్లో వెలుగులు లేవని, వడ్డెర కులస్తులు ఎటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. అలాగే జనవరి 11న వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్రపండుగలా జరపాలని డిమాండ్‌చేసారు. ఈ సమావేశంలో జిల్లా వడ్డెర సంఘ అధ్యక్షులు రవీంద్రరాజు, నాయకులు హరిబాబు, రుద్రయ్య, కుసుమ, అయ్యప్ప, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఇఓలకు చేరిన సీనియార్టీ జాబితా

– నేడు మున్సిపల్ పాఠశాలల ఎస్జీటీలకు పదోన్నతులు

**చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:**

మున్సిపల్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల సీనియార్టీ జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. సిద్ధం చేసిన ఎస్జీటీల సీనియార్టీ జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదివారం డివైఇఓలు, ఎంఇఓలకు మెయిల్స్ ద్వారా సమాచారం అందజేశారు. ఈ మేరకు సీనియార్టీ జాబితాలో వున్న ఎస్జీటీలు మాత్రమే వారి ఎస్ఆర్, సంబంధిత సర్టిఫికేట్లతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగే ఎస్జీటీల పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని మున్సిపల్ స్కూళ్ళలో స్కూల్ అసిస్టెంట్ మాథ్స్‌కు సంబంధించి ఒక ఖాళీ, స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్‌కు సంబంధించి ఒక ఖాళీ, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషుకు సంబంధించి నాలుగు, స్కూల్ అసిస్టెంట్ మాథ్స్(తెలుగు)-2, స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్('తెలుగు)-1, స్కూల్ అసిస్టెంట్ బయాలజి(తెలుగు)-7, స్కూల్ అసిస్టెంట్ సోషియల్(తెలుగు)-10, ఫిజికల్ డైరెక్టర్-1 ఖాళీ వున్నాయని డిఇఓ వరలక్ష్మీ తెలిపారు.

## హైందవ శంఖారావ సభను జయప్రదం చేయండి

సోమల, డిసెంబర్ 22, ప్రభాతవార్త



విజయవాడలో జనవరి 5వ తేదీ జరిగే హైందవ శంఖారావ సభను జయప్రదం చేయాలంటూ పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సోమల టిటిడి కల్యాణ మండపంలో ఆదివారం హైందవ శంఖారావ సభ సమ్మేళనం జరిగింది. హిందువుల అభివృద్ధి హిందూ దేవాలయాల పరిరక్షణ దృష్టిలో ఉంచుకొని మండలంలోని హిందువులందరూ తప్పనిసరిగా విజయవాడ తరలి రావాలని భారతీయ జనతా పార్టీ పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ గన్న మదన్ మోహన్ బాబు పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ హిందువులు మేల్కొనకపోతే భవిష్యత్ తరాల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కళాశాల విద్యార్థి ప్రముఖ అశోక్ ఆర్ఎస్ఎస్ చిత్తూరు జిల్లా ప్రచారక్ శివ సోమల మండల నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి ప్రసాద్ శ్రీధర్ ప్రదీప్ లక్ష్మిప్రసాద్, గిరి, హరి పాల్గొన్నారు

## పాలేటమ్మ ఆలయంలో విశేష పూజలు

సోమల, డిసెంబర్ 22, ప్రభాతవార్త



నెల్లిమంద సమీపంలో వెలసిన పాలేటి గంగమ్మ ఆలయంలో ఆదివారం పాయిల వంశస్థులు విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి అత్యంత ప్రీతి దినం కావడంతో పూజలు నిర్వహించారు. బోనాలు సమర్పించి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పాయల చంద్రశేఖర్, కోదండ రామయ్య, జగన్మోహన్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల అభివృద్ధికి ప్రత్యేక కృషి

**రొంపిచెర్ల, డిసెంబర్ 22, ప్రభాతవార్త:**



దివ్యాంగులు అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు తెలిపారు. రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో, హైస్కూల్ వీధిలో అనారోగ్యంతో బాధపడుతున్న దిలీప్‌ను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అన్నింటినీ అందించేందుకు ముందుంటామన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే స్టిక్కులు, బ్యాటరీ సైకిల్, వినికిడి యంత్రాలు, వీల్ ఛైర్లు, టాయిలెట్ ఛైర్ లను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మదలీ, కార్యవర్గ సభ్యులు బాషా, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

## మిట్టరాళ్లచేనులో మంచినీటి సమస్య పరిష్కారం

కుప్పంరూరల్, డిసెంబర్ 22 ప్రభాతవార్త



మండలంలోని కొటాలూరు పంచాయతీ మిట్టరాళ్లచేను గ్రామంలో మంచినీటి సమస్యను సర్పంచ్ రాజేంద్రన్, మాజీ సర్పంచ్ సంజీవరాజులు నాయుడు అధ్వర్యంలో పరిష్కరించారు. గ్రామంలో వేసిన మంచినీటి బోరుకు పైపులు ఏర్పాటుచేసి నీటి సమస్యను పరిష్కరించారు. దీ ంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## 200కుటుంబాలు జనసేనలో చేరిక



**పుంగనూరు,డిసెంబరు 22 ప్రభాతవార్త :** జనసేన నియోజకవర్గ నాయకుడు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి సారధ్యంలో పల్లెపల్లెకు జనసేన యాత్ర సాగుతోంది. ఆదివారం మండలంలోని కీలక ప్రాంతమైన,పలు పల్లెల కూడలిఅయిన భీమగానిపల్లిలో పల్లెపల్లెకు జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం భీమగానిపల్లి గ్రామానికి చేరడానికి ముందు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి అధ్వర్యంలో జనసేన నాయకులు శ్రీకృష్ణదేవరాయల కూడలిలో ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి చేరుకున్న వేణుగోపాల్‌రెడ్డి గ్రామంలో జనసేన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోడినాయునిపల్లి,పూజగానిపల్లి తదితర పంచాయతీలనుంచి రెండువందల కుటుంబాలు జనసేనలో చేరడంతో వారికి వేణుగోపాల్‌రెడ్డి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శివారెడ్డి, విరూపాక్షి,నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి,రమణ,చిన్నాతో పాటూ నరేష్,చైతన్య, భాస్కర, కోదండ,హరి,వెంకటరమణారెడ్డి, శంకరరెడ్డి, రేవంత్,సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## భక్తజన సంద్రమైన శక్తిక్షేత్రం



**బోయకొండ(చౌడేపల్లి), డిసెంబర్ 22 ప్రభాతవార్త** శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో నిండింది. ఆదివారం కొండ దినం కావడంతో రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల వారు తరలిరావడంతో యాత్రీకుల రద్దీ అధికమైంది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణ గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆలయ అర్చక, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడంలో ట్రాన్స్‌కో నిర్లక్ష్యం

– రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్న రైతులు – ముదిరిపోతున్న వరినారు



**వెదురుకుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త :** వ్యవసాయం కొరకు ప్రభుత్వం అమర్చిన హెచ్‌డివిఎస్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి రెండు నెలలు గడిచిన ట్రాన్స్‌కో ఏఇ నిర్లక్ష్యం కారణంగా కొత్తది అమర్చకపోవ డంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన ప్రయోజనం లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రమైన వెదురుకుప్పం పరిధిలోగల రైతు చిన్నబ్బ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల కురిసిన వర్షాల సమయంలో పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. హెచ్‌డివిఎస్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో నాలుగు వ్యవసాయ మోటార్లకు సర్వీసు ఉందన్నారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన సమాచారం అందించడంతో లైన్‌మేన్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ తీసుకుని వెళ్ళడం జరిగిందన్నారు. కాని రెండు నెలలు గడుస్తున్న అమర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము వేసిన వరినారు ముదిరిపోయిందని ఆవేదనచెందారు. ఉన్నతస్థాయి అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## చెప్పినట్లు వినాల్సిందే!

– క్షేత్ర స్థాయి అధికారులను బెదిరిస్తున్న మండల స్థాయి అధికార పార్టీ నేత

పాలసముద్రం, డిసెంబర్ 22 ప్రభాతవార్త:

ఈ మండలంలో విధులు నిర్వర్తించాలంటే తాను చెప్పినట్లు వినాల్సిందేనని ఓ మండల స్థాయి అధికార పార్టీ నాయకుడు మండల పరిధిలోని క్షేత్ర స్థాయి ప్రభుత్వ సిబ్బందిని బెదిరిస్తుండటంతో అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. మండల పరిధిలో అధికారులు ఏ పని చేసినా ఆ పని తనకు చెప్పి చేయాల్సిందేనని, లేకుంటే మండలం విడిచి వెళ్ళిపోతారని ఆయన స్పష్టం చేస్తున్నాడు. క్షేత్ర స్థాయి ప్రభుత్వ సిబ్బంది ఈ నాయకుడి బెదిరింపులకు భయపడి కిమ్మనకుండా అతను చెప్పినట్లు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ ఆ నేత చెప్పినట్లు క్షేత్ర స్థాయి అధికారులు చేయకుంటే తమను మండల స్థాయి అధికారుల ఎదుట నిల్చోబెట్టడం, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధుల వద్ద ఫిర్యాదు చేయడం వంటివి చేస్తుండటంతో ఆ నేత చెప్పన్న పనులు నిబంధనలకు విరుద్ధంగా వున్నప్పటికీ కొంతమంది భయపడి చేసిపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఇప్పట్లో బదిలీలు లేకపోవడంతో ఉన్నత అధికారులు సైతం వారికి సర్దుబాటు చేసుకుని వెళ్ళాలని సూచించినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో పాలసముద్రం మండలంలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది అధికారులు, ప్రభుత్వ సిబ్బంది ఆవేదనను జిల్లా స్థాయి అధికారులైనా తెలుసుకుని తమకు ఈ కష్టాల నుండి గట్టెక్కించాలని కోరుకుంటున్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం.. సారా ఊట ధ్వంసం

కుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త



కుప్పం ఎక్సైజ్, ఇఎస్‌టిఎఫ్ చిత్తూరు బృందం కలిసి చేపట్టిన దాడుల్లో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజ తెలిపారు. శాంతిపురం బస్‌స్టాప్ వద్ద బోయనపల్లికి చెందిన కృష్ణప్పనుంచి 30 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే కుప్పం మండలం మోట్లచేను అటవీ ప్రాంతంలో 600 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేశామన్నారు. ఈ వారంలో మొత్తం 7కేసులు నమోదు చేసి ఐదుమందిని అరెస్ట్ చేశామన్నారు. 132కర్ణాటక మద్యం ప్యాకెట్లు,1200లీటర్లనాటుసారాసీజ్ చేశామన్నారు.అక్రమకర్ణాటకమద్యం,నాటుసారా తయారీ చేపడితే ప్రజలుఎక్సైజ్ సిఐ 9885399789, ఎస్సై 9441949568నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## రజకులకు కుప్పంలో దోభీ కాలనీ ఏర్పాటుచేయాలి

– రాష్ట్ర రజకసంఘ నేత సిఆర్ మోహన్

**కుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గంలో ఉన్న రజకకులస్తుల సౌకర్యార్థం కుప్పంలో దోభీ కాలనీ ఏర్పాటుచేయాలని రాష్ట్ర రజక సంఘం సీనియర్ నాయకుడు సిఆర్ మోహన్ పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఎంతోమంది పేద రజక కుటుంబాలు కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. కుప్పంలో రజకులకు దోభీ కాలనీ నిర్మించి అక్కడే దోభీఘాట్, కమ్యూనిటీ భవనం ఏర్పాటుచేయిస్తే రజక కులస్తులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈవిషయంగా రజకులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారన్నారు. అలాగేవాలంటీర్ చేతిలో మోసపోయిన బాలిక కుటుంబానికి తగున్యాయం చేయాలన్నారు. ఈ మేరకు రజకుల సమస్యలపై సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనమ్మకు స్థానిక రజక సంఘం నేతలతో కలసి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. నారా భువనమ్మ ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో రజక సంఘ నేతలు రంగనాథ్, నరసింహులు, రమేష్ పాల్గొన్నారు.

## సత్యసాయిసేవాసమితిచే పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ

**కుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త** శ్రీ సత్యసాయి సేవా సమితి చిత్తూరు జిల్లా వారి అధ్వర్యంలో గుడుపల్లె మండలం జాతికర్తన పల్లి గ్రామంలో ఆదివారం పేద విద్యార్థులు నలభైమందికి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త డా॥ యశోద, బాలవికాస్ సమన్వయకర్త వసంత, హేమలత, సేవాదళ్ వాసవి, కుప్పం సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్య, సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది కెవి ప్రసాద్, కన్వీనర్ హరి పాల్గొన్నారు.

## జనసైనికుల ఆత్మీయ సమావేశం

పలువురు యువకులు పార్టీలో చేరిక



వెదురుకుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త :

గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జీ పొన్న యుగంధర్ ఆధ్వర్యంలో ఆదివారం భారతం మిట్ట వద్దజనసైనికుల ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ముందుగా తిరుమలయ్యపల్లె పంచాయితీ మొరవ నుంచి భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిస్వార్ధ రాజకీయాలు,నిజమైన రాష్ట్ర అభివృద్ధి డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్‌తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యతీశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, శేఖర్ రెడ్డి, నక్కా మధు, ఆరు మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మఠం భవన నిర్మాణానికి భూమి పూజ

చౌడేపల్లి, డిసెంబర్ 22 ప్రభాతవార్త



జగద్గురు ఆదిశంకరాచార్యుల మఠం భవన నిర్మాణా నికి భూమి పూజను నిర్వహించారు. పట్టణంలోని కుమ్మరవీధి. లో గల కళ్యాణ గంగమ్మ ఆలయం ఆవర ణంలో బ్రాహ్మణ సంఘంచే నిర్మాణానికి భూమి పూజ జరిగింది. బ్రాహ్మణులకు సంబంధించినఇత్యాధికార్యక్రమాలకు భవనాన్ని నిర్మించుకొన్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. మాజీ ఎంపిపి శ్రీరామ్ రెడ్డి ప్రకాష్, కడియాల రాజన్న, వినాయకయూత్ సభ్యులు పిల్లారీ ఏజెన్సీస్ అధినేత పిల్లారి జీవన్ ప్రకాష్, గణేష్, తుంగా అమరనాథ్, వేద పండితులు సత్యానారాయణశర్మ, రాజశేఖర్ దీక్షితులు ,వశిష్టాచార్యులు,ఎవి.సుబ్రమణ్యం, బ్రాహ్మణసంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## నేడు పోలీస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలను ఎస్పీ మణికంఠ చందోలు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవచ్చును. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను సత్వరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు అందరు విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

## కాణిపాకం సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, డిసెంబర్ 22 ప్రభాతవార్త



రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పెంచల్ కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లువాసు,కోదండపాణి,టెంపుల్ ఇన్స్ పెక్టర్ బాలాజీనాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## వరదునికి వెండి ఆభరణాలు బహూకరణ

కాణిపాకం, డిసెంబర్ 22 ప్రభాతవార్త:



కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజ స్వామి ఆలయంకు ఓ భక్తుడు 1.85 లక్షలు రూపాయలు విలువగల వెండి ఆభరణాలను ఆదివారం బహూకరించారు. ఈమేరకు శ్రీదేవి భూదేవి సయిత శ్రీవరదరాజస్వామివారికి బెంగుళూరుకు చెందిన నవీన్‌కుమార్ అనే భక్తుడు 1 కిలో 800 గ్రాముల వెండితో 1.85 లక్షలు వెచ్చించి ప్రత్యేకంగా తయారు చేయించిన హస్తాలు, పాదాలను విరాళంగా అందజేశారు. వీటిని ఆలయ ఈఓ పెంచల కిషోర్ కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలనుఅందజేశారుఆలయఏఈఓరవీంద్రబాబు, ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## కేంద్ర హోమ్‌మంత్రి సత్వరం రాజీనామా చేయాలి

చిత్తూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త:



రాజ్యంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను హేయంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సత్వరం రాజీనామా చేసి డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు క్షమాపణలు చెప్పాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు భాస్కర్ డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోడి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యంగంను ప్రక్కన పెట్టి కొత్త రాజ్యాంగంను అమలు చేయడానికి పూనుకుంటున్నారని ఇది దేశానికి ఏ మాత్రం శ్రేయస్కారం కాదన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ఆలోచించి, చర్చించి సిద్ధం చేసిన రాజ్యాంగంను సంరక్షించడానికి దేశ వ్యాప్తంగా వున్న అన్ని వర్గాల ప్రజలు నడుంబిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జనసేనలో చేరిన నక్కా మధు

వెదురుకుప్పం, డిసెంబర్ 22 ప్రభాతవార్త :

మండలంలోని గొడుగుచింత పంచాయితీ సర్పంచ్ నక్కా బాబు కుమారుడు నక్కా మధు ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జీ పొన్నాయుగంధర్ ఆధ్వర్యంలో చేరారు. యుగంధర్ పార్టీ కండువా కప్పి మధును పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆటోనగర్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించండి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఆటో మొబైల్ మెకానిక్ ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డిని కలసి ఆటో మెకానిక్ ఇంజనీరింగ్ గ్యారేజీ అసోసియేషన్ యూనియన్ నాయకులు వినతి ఇస్తూ తమకు ఆటో మొబైల్ ఇంజనీరింగ్ గ్యారేజీకి స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రాన్ని అందించారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఏ త్వరలోనే ఆటోనగర్ గ్యారేజీ స్థల సేకరణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు గోపినాయుడు, ఉపాధ్యక్షుడు మోహన్‌గౌడ్, కార్యదర్శి మునిగోపాల్, సంయుక్త కార్యదర్శి సాదిక్ బేగ్, ట్రెజరర్ సుబ్రమణ్యం(మణి), గౌరవాధ్యక్షుడు రవినాయుడు, సభ్యులు గురుశంకరయ్య, తిరుపాల్‌రెడ్డి, సురేష్, చెంగ్రాయులు, మురళీ, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లాన్ టెన్నిస్ పోటీల్లో సచివాలయ ఉద్యోగి ప్రతిభ

తొట్టంబేడు, డిసెంబర్ 22 ప్రభాతవార్త

మండలంలోని తొట్టంబేడు గ్రామ సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీరాఘవ రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లోని సావల్ మనీష్ స్టేడియంలో జరిగిన లాన్‌టెన్నిస్ పోటీల్లో సెమిఫైనల్‌లో శ్రీకాళహస్తికి చెందిన ఎస్.శ్రీరాఘవ చెన్నైకు చెందిన ఇన్‌కంట్యాక్స్ అధికారి మనీష్ సురేష్‌కుమార్ చేతిలో ఓటమిపాలయ్యాడు. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీరాఘవ పురుషుల సింగిల్స్ పోటీల్లో ఫైనల్స్‌లో సురేష్‌కుమార్‌చేతిలో ఓడిపోయాడు. ఏపి నుంచి కెప్టెన్‌గా ఎంపికైన శ్రీరాఘవ టీంలో పురుషులు, మహిళలు కలసి 10మంది వరకు పోటీలకు వెళ్ళారు. 128మంది సింగిల్స్ పోటీల్లో రిజర్వ్ స్పోర్ట్స్ బోర్డుతో కలసి వెళ్ళారు. ఈనెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగిన పోటీలు ముగిసాయి. దీంతో లాన్‌టెన్నిస్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనపరచిన సచివాలయ సర్వేయర్ రాఘవ.

## గంగ కాలువ పరీవాహక ప్రాంతాల్లో మట్టి మాఫియా

.తొట్టంబేడు, డిసెంబర్ 22 ప్రభాతవార్త



మూడు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ విరూపాక్షపురం గ్రామంలో రెవెన్యూ సదస్సుకు హాజరై సమీపంలో ఉన్న స్వర్ణముఖినదిలో ఇసుకను సాయంత్రం 6గంటలపైగా తరలిస్తే వారిపై పిడియాక్టుకేసు నమోదు చేయాలని పోలీసులను ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సమక్షంలో తెలిపిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇసుక మాఫియా దారులు కొందరు తాటిపర్తి, కళ్ళిపూడి గ్రామాల వద్ద ఉన్న తెలుగుగంగ 7వ బ్రాంచి కాలువ సమీపంలో ఉన్న ఎర్రమట్టిని జెసిబిలతో తరలిస్తుండడం గమనించదగ్గ విషయం. తొట్టంబేడు మండలం అంటేనే అందరికి జేబులు నింపే కామధేనువులా కనిపిస్తోంది. ఎక్కడ చూసినా ఆక్రమణలు, అక్రమకట్టడాలు మనకు కనిపిస్తాయి. ఇక్కడ పరిశ్రమలకు తెలుగుగంగ కాలువ నీరు లేకపోతే పనులు జరగవంటే ఆశ్చర్యం కలగకమానదు. కొందరు మట్టిమాఫియాదారులు మట్టి పట్టపగలే జెసిబిలతో అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమరవాణాపై ఉన్నతాధికారులు, పోలీసులు చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నేటి నుంచి డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు

-పరీక్షలకు హాజరు కానున్నా 3వేల మంది విద్యార్థులు

తిరుపతి విద్య డిసెంబర్ 22 ప్రభాత వార్త:



టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలలు అటానమస్ హోదాలో తొలి అడుగు వేయనున్నాయి.ఈ ఏడాది ప్రారంభంలో అటానమస్ హోదా సాధించిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాల,ఎస్ జీ ఎస్, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలు తొలి సారి ప్రత్యేక హోదాలో తొలి పరీక్షకు సిద్ధమయ్యాయి. నేటి నుంచి ఈనెల 31వతేదీ వరకు బీఏ, బీకాం,బీఎస్సీ కి సంబంధించిన కోర్సులలో ప్రవేశాలు పొందిన ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు తొలి సెమిస్టర్ పరీక్షలను నిర్వహించనున్నాయి.ఈ మేరకు టీటీడీ విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## స్క్రాప్ ద్వారా ఎస్వీయూకు రూ.15 లక్షల ఆదాయం...!

తిరుపతి విద్య డిసెంబర్ 22 ప్రభాత వార్త:



ఎస్వీయూలో గత కొన్ని ఏళ్లుగా పేరుకుపోయిన వేస్టేజ్ (స్క్రాప్)ను వర్సిటీ అధికారులు అంచెలంచెలుగా విక్రయిస్తున్నారు.ఎడ్యుకేషన్ విభాగం సమీపంలోని అసంపూర్తిగా ఉన్న భవనంలో నిల్వ ఉంచిన పాతపేపర్లు,ఐరన్ వంటి వేస్టేజ్ ను వేరు చేసి విక్రయిస్తున్నారు.గత వారం రోజులుగా జరుగుతున్న ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు ఏడు లారీల వరకు విక్రయించినట్లు తెలుస్తోంది.దీంతో రూ.9లక్షలు వరకు వర్సిటీకీ అదాయం సమకూరిందని,మరో ఐదు నుంచి ఆరు లక్షల విలువ చేసే స్క్రాప్ మిగిలి ఉంటుందని సమాచారం. మరో మూడు రోజులల్లో మిగిలి స్క్రాప్ ను తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.టెండర్ ప్రక్రియ ద్వారానే అత్యధిక రేటుకు విక్రయించినట్లు అధికారులు చెబుతున్నారు.దీంతో పాటు వర్సిటీలో సుమారు 45 విభాగాలలో మరింత వేస్టేజ్ పేరుకుపోయిందని, పారదర్శకంగా టెండర్ల ద్వారా విక్రయిస్తే మరింత ఆదాయం వర్సిటీ లభిస్తుందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

## 26న డ్రాగన్ బోట్ ఎంపికలు

తిరుపతి క్రీడ, డిసెంబర్ 22, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ కెనాయింగ్, కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న డ్రాగన్ బోట్ పోటీల ఎంపికలు రాయలచెరువులోని రామచంద్రాపురం మండలంలో స్త్రీ, పురుషులకు, మిక్సడ్ క్యాటగిరిలో 1.200 మీటర్ డ్రాగన్ బోట్ స్ప్రింట్ 2,500 మీటర్లు డ్రాగన్ బోట్ స్ప్రింట్, 3.2000 మీటర్లు ఎండూరెన్సు రేసులో పోటీలు నిర్వహించడం జరుగుతుందని డిఎస్‌డిఓ సయ్యద్ సాహెబ్ తెలిపారు. ఔత్సాహికులైన స్త్రీ పురుషులు పడవ పోటీలలో ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు రాయల చెరువు వద్ద హాజరుకావాలన్నారు. 13వ డ్రాగన్ బోట్ నేషనల్ ఛాంపియన్ షిప్ ఢిల్లీలో జనవరి 3 నుండి 6వ తేది వరకు జరుగుతాయని రాష్ట్ర కెనాయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షులు బలరాం నాయుడు తెలిపారు. వివరాలకు 9542034270 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

## గణితమేధావి రామానుజన్ జయంతి వేడుకలు

తిరుపతి(రవాణ),డిసెంబర్ 22ప్రభాతవార్త:



భారతదేశం గర్వించదగిన గణిత మేదావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, గరికపాటి రమేష్‌బాబు, కల్లూరు చెంగయ్య తదితరులు ఎస్వీయూలోని రామానుజన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

## ధనుర్మాసం అయ్యప్ప పూజలకు ప్రాధాన్యత



శ్రీకాళహస్తి,డిసెంబర్ 22 ప్రభాతవార్త

ధనుర్మాసం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ వైపు గొబ్బెమ్మగా వెలసిన గౌరమ్మ గ్రామోత్సవం మరో వైపు శబరిమల వెళ్ళు వచ్చే వెళ్లె అయ్యప్పభక్తులతో కళ కళ లాడుతుంది. జీవనది స్వర్ణముఖినదిలో నిండుగా నీరుండటంతో అయ్యప్ప భక్తులు స్నానమాచరించి స్వామి దర్శనానికి వస్తున్నారు. వారి భక్తుల సౌకర్యార్థం ఆలయాధికారులు అయ్యప్ప విగ్రహాన్ని ఏర్పాటు చేసారు. ఈ ఏడాది ఇఒ టి.బాపిరెడ్డి ప్రత్యేక శ్రద్ద వహించారు.16కాళ్ళ మండపంలో పంచలోహ అయ్యప్ప విగ్రహాన్ని ఏర్పాటు చేసి 16 మెట్లను ఏర్పాటు చేసారు.ప్రతి రోజు ఇక్కడ భక్తుల భజనలతో పూజలతో సందడిగా ఉంటుంది. రద్దీ రోజుల్లో ఆలయాధికారులు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి 16కాళ్ళ మండపంలో అయ్యప్ప భజనలతో దద్దరిల్లింది.

## శివయ్య సేవలో ఐటిడిపి కార్యదర్శి



శ్రీకాళహస్తి,డిసెంబర్ 22 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ఆదివారం ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి శివకుమార్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక్కడకు వచ్చిన ఆయన ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరటంతో తెలుగుదేశం పార్టీకి చెందిన బాలాజి,ఖాదర్‌లు ఏర్పాట్లు చేపట్టారు. రాహుకేతు ప్రత్యేక దోష నివారణ పూజలు జరిపించు కున్న శివకుమార్‌కు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.స్వామి అమ్మవార్ల ప్రసాదాలను అందించారు.

## ఓపన్ వర్సిటీ అడ్మిషన్లకు అనుమతి ఇవ్వండి



తిరుపతి విద్య డిసెంబర్ 22 ప్రభాత వార్త:

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపన్ యూనివర్సిటీలో నిలిపివేసిన యూజీ,పీజీ, డిప్లొమో కోర్సులలో అడ్మిషన్లకు వచ్చే ఏడాది నుంచి అనుమతులు ఇవ్వాలని విద్యార్థులు, అధ్యాపకులు ప్రభుత్వానికి విన్నవించారు.ఈ మేరకు ఆదివారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలోని అంబేద్కర్ ఓపన్ వర్సిటీ స్టడీ సెంటర్ వద్ద ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఓపన్ వర్సిటీలో ఏడాదిగా అడ్మిషన్లు నిలిపివేశారన్నారు.రాష్ట్రంలో ఎంతో మంది బడుగు బలహీన వర్గాలకు ఉన్నత చదువులకు అండగా ఉన్న అంబేద్కర్ ఓపన్ వర్సిటీలో అడ్మిషన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేల మంది పీజీ,యూజీ కోర్సులలో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు.పలు ప్రాంతాల నుంచి ప్రవేశాలు ఆశిస్తున్న విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీ పాలనలో స్వేచ్ఛకు ఏపీ కేరాఫ్




– కూటమిని కొనియాడిన యాదవ నేతలు

తిరుపతి హెల్త్, డిసెంబరు 22 ప్రభాతవార్త ః

గత ఐదేళ్ళ వైసీపీ పాలన స్వేచ్ఛకు సంకేళ్ళు వేసి భూకబ్జాలు, దోపిడీలు, హత్యా రాజకీయాలకు పాల్పడ్డారని, ప్రశ్నించిన వారి స్వేచ్ఛను హరించి గుండాయిజాన్ని చెలాయించారని ఈ ఫ్యాన్ పార్టీ పాలనకు భిన్నంగా ఎన్డీఏ కూటమి పాలనలో భయానికి చోటు లేని ఏపీ స్టేట్‌గా పాలన కొనసాగిస్తున్నారని టీడీపీ యాదవ నేతలు అన్నా అనితాయాదవ్, శంకర్, శ్రీరాములు, బాల, శేఖర్ యాదవ్‌లు కూటమి ప్రభుత్వాన్ని కొనియాడారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మీడియా ముందు మాట్లాడారు. జగనన్న జన్మదినం రోజున స్థానిక మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ సీఎం చంద్రబాబును విమర్శించడంలో అర్థం లేదన్నారు.

## మహిళా వర్సిటీలో శ్రీనివాస రామనుజన్ జయంతి వేడుకలు




తిరుపతి విద్య, డిసెంబర్ 22 ప్రభాత వార్త:

పద్మావతి మహిళా వర్సిటీ అప్లైడ్ మ్యాథ్మెటిక్స్ విభాగం,ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు రామానుజన్ చిత్రపటానికి నివాళుర్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటలక్ష్మీ, రిటైర్డ్ ప్రొఫెసర్లు సరోజమ్మ, లీలారత్నం,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి విశాలి,డాక్టర్ శివపార్వతి విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీనివాస రామానుజన్ గొప్ప గణిత కోవిదుడు



రేణిగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త:

శ్రీనివాస రామానుజన్ భారతదేశం గర్వించదగ్గ గొప్ప గణిత కోవిదుడని గౌతమిస్ ఆక్స్‌ఫర్డ్ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ గౌతమి అన్నారు. రేణిగుంటలోని ప్రముఖ విద్యా సంస్థ గౌతమిస్‌ఆక్స్‌ఫర్డ్ మోడల్ స్కూలులో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆదివారం విద్యార్థులు గణిత ప్రాజెక్టుల ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆల్‌జీబ్రా, జామెట్రి, అర్థమెటిక్, గణితానికి సంబంధించిన పజిల్లు తదితర గణిత నమూనాలను సందర్శకులకు అభినందించేలా వివరించారు. మంచి నమూనాలను ఎంపిక చేసి గెలుపొందిన విద్యార్థులకు జడ్జిలుగా వ్యవహరించిన ఎస్వీ యూనివర్సిటీ కెమిస్ట్రీ యూనివర్సిటీ ప్రొఫెసర్ శివకుమార్, బాలకృష్ణ బహుమతులు అందజేశారు. విద్యా సంస్థ కరస్పాండెంట్ మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వోకు ఘన సన్మానం



రేణిగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పదవి బాధ్యతలు చేపట్టిన బాలకృష్ణ నాయక్‌ను తెలుగు నాడు మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆయనను సత్కరించిన వారిలో తెలుగు నాడు మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శివరాజు, జిల్లా వర్కింగ్ అధ్యక్షులు మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులుఉన్నారు.బాలకృష్ణనాయక్ సౌమ్యుడు, మంచివాడని జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు మురళి అన్నారు.

## గణితం..చిన్నారులకు సులభతరం




తొట్టంబేడు, డిసెంబర్ 22 ప్రభాతవార్త

గణితశాస్త్రం చిన్నారులకు సులభతరం అని మండలంలోని సెయింట్‌జేవియర్స్ పాఠశాలలో గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ 138వ జయంతిని గణిత దినోత్సవ సందర్భంగా ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ షెర్లీ ఆధ్వర్యంలో గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.తరగతుల వారీగా విద్యార్థి విద్యార్థినులు గణితశాస్త్రానికి సంబంధించిన ప్రాజెక్టులను పాఠశాల నందు ప్రదర్శించడం జరిగింది. పిల్లలు గణిత సూత్రాలను ఉదాహరణలతో చక్కగా వివరించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించి అభినందించారు. గణితశాస్త్రం అంటేనే ఎవ్వరు భయపడాల్సిన అవసరం లేదని నేటి కంప్యూటర్ ప్రపంచంలో పోటీ తత్వం అలవరచుకుని చదవాలని లక్ష్యాన్ని నిర్దేశించి చదువుకుంటే విజయం సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు గణితశాస్త్ర ఉపాధ్యాయులును కూడా షెర్లీ అభినందించారు.

## స్వర్ణముఖి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఏకగ్రీవ ఎన్నిక

–అభినందించిన సూళ్ళూరుపేట ఎంఎల్‌ఏ



.శ్రీకాళహస్తి, డిసెంబర్ 22 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని ఇరిగేషన్ కార్యాలయంలో స్వర్ణముఖి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా పెళ్ళకూరుకు చెందిన ప్రసాద్‌నాయుడు, వైస్ ఛైర్మన్‌గా తొట్టంబేడు మండలంకు చెందిన శంకర్‌నాయుడులును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్వర్ణముఖి ఆనకట్ట కమిటీ కార్యవర్గాన్ని సూళ్ళూరుపేట ఎంఎల్‌ఏ నెలవలవిజయశ్రీ అభినందించారు. నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే విధంగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎంతో దూరదృష్టితో ముందుకు సాగుతున్నారని రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి సంఘాలు ఏకగ్రీవం కావడం ఆయన దార్శనితకు నిదర్శనమని ఎంఎల్‌ఏ విజయశ్రీ, మాజీ ఎంపి నెలవుల సుబ్రహ్మణ్యం అన్నారు. ఎన్నికల అధికారి జీఎంసి ఈఈ సుబ్రమణ్యం నేతృత్వంలో ఎన్నికలు నిర్వహించారు. స్వర్ణముఖి ప్రాజెక్టు పరిధిలో రూ.6కోట్లు అధ్యక్షుల ద్వారా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌గా పెళ్ళకూరు ఆయకట్టు అధ్యక్షుడు డి.ప్రసాద్‌నాయుడు, ఘట్టమనేని శంకరనాయుడులను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి ఎన్నికైన వారికి ధృవీకరణపత్రాలు అందించి అభినందించారు.

## ధ్యానం సర్వరోగ నివారణి



పుత్తూరురూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త:

పుత్తూరులో శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ ధ్యానాలయంలో జరిగిన ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి నుంచి వచ్చిన ధ్యాన గురువు మునిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, ధ్యానం ద్వారా పొందిన ఆత్మ జ్ఞానంతో విశ్లేషణా శక్తి పెరిగి తద్వారా ఓర్పు, నేర్పు, సహనం, సన్మార్గం వివేచన మొదలగు మంచి గుణములు అలవడతాయని, జీవన శైలిలో అద్భుతమైన మార్పులు వస్తాయని, విలువలతో కూడిన కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుందని సూచించారు. కమిటీ సభ్యులు గంగయ్య నాయుడు, చెంగల్రాజు, భాస్కర్, పయణి, శ్రీహరి, రామకృష్ణమనాయుడు, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

## ఘనంగా 65 వ ప్రపంచ వికలాంగుల దినోత్సవం.



తిరుపతి విద్య డిసెంబర్ 22 ప్రభాత వార్త:

స్థానిక బాబు జగజీవన్ రావ్ భవనంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వికలాంగుల సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు వికలాంగులకు ప్రభుత్వం నుండి సహాయ సహకారాల తో పాటు,వారి ఆర్థిక అభివృద్ధి తోడ్పాటు పై సమీక్షించారు.వీరికి ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షులు బత్తిన మధుబాబు వితరణ చేశారు.జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సూచనలతో,డొక్కా సీతమ్మ స్ఫూర్తితో తిరుపతి ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు అదేశలతో, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరి ప్రసాద్ సూచన తో వికలాంగులకు అన్నదానం చేయడం సంతోషం ఉందని,వీరికి జనసేన నుండి పూర్తిగా అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రెడ్డయ్య ఉమ్మడి చిత్తూరు జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు తదితరుల పాల్గొన్నారు.

## శివయ్యసేవలో సుప్రీం జడ్జి



శ్రీకాళహస్తి,డిసెంబర్ 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సుప్రీం కోర్టు జడ్జి జేకె మహేశ్వరి కుటుంబసమేతంగా పూజలు జరిపించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఒ టి.బాపిరెడ్డి ఆదేశాలతో డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డిఆలయ పిఆర్ఓ రవి వేదపండితులచే స్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయంలోని శిల్ప కళను చూసిన ఆమె మంత్ర ముగ్దులయ్యారు. ఆలయ చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు.పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుని లింగం మాత్రం ఆంధ్ర ప్రదేశ్‌లో ఉందని మిగిలిన నాలుగు లింగాలు తమిళనాడులో వెలసి ఉన్నాయని ఆమెకు వివరించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి స్వామి అమ్మవార్ల ప్రసాదాలు, చిత్రపటాలు,అందించగా వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లను ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ సిఎస్‌ఒ నాగభూషణం యాదవ్12వఅడిషనల్‌డిస్ట్రిక్ట్‌జడ్జి శ్రీనివాస్‌నాయక్, 3వ అడిషినల్ జిల్లా జడ్జి గురునాథం పర్యవేక్షించారు.

## హ్యూమన్‌రైట్స్ ఉపాధ్యక్షుల నియామకం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 22 ప్రభాతవార్త

జాతీయ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా శ్రీకాళహస్తికి చెందిన సామాజిక వాదికి అవకాశం దక్కింది. పట్టణానికి చెందిన కామి వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉత్తర్వులు జారి చేసారు. ఆయనను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి,ఓబిసి వర్గాల సమస్యలపై స్పందించి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని అందరికిఅందుబాటులో ఉంటూ సేవలందిస్తామని వివరించారు.రిపబ్లిక్‌క్లబ్‌లో ఆయన్ను సత్కరించారు.

## అప్పుల బాధతో జనసేన మండల నాయకుడు ఆత్మహత్య



శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలానికి చెందిన జనసేన క్రియా వాలంటీర్ సభ్యుడు లోకనాథం ఇంగోలు అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందింది. వారి కుటుంబాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు.రావిళ్ళ వారి కండ్రిగకు చెందిన లోకనాథం 2014 నుంచి పార్టీలో ఉంటూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతేకాక వైకాపా పాలనలో జరిగిన ప్రజా పోరులో వినూత కోటతో కలసి నడిచారు.కుటుంబం గడవక,పార్టీ కార్యక్రమాలకు అప్పులు చేసినట్లు మండలంలో చర్చించుకుంటున్నారు.అప్పుల బాధను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం విషయం తెలుసుకున్న నియోజకవర్గం ఇన్‌చార్జి వినూత, కోట చంద్ర, జనసైనికులు రావిళ్ళ వారి కండ్రిగకు చేరుకొనినివాళులర్పించారు.

## వికృతమాల ప్రభుత్వ గృహాల కమిటి



శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 22 ప్రభాతవార్త

ఏర్పేడుమండలంలోని వికృతమాలలో గతంలో ప్రభుత్వం నిర్మించి వదలిపెట్టిన ప్రభుత్వ గృహాల అభివృద్ది కమిటి మరమ్మతులను చేపట్టారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అదధికారంలో ఉన్నపుడు ప్రభుత్వ గృహాలను నిర్మించారు. వైకాపా పాలనలో నిర్లక్ష్యంగా వదలిపెట్టారు.ఈ గృహాల అభివృద్దికి ఓ కమిటిని ఏర్పాటు చేసుకున్నారు. ఏఐటియూసి సారధ్యంలో కొత్త కమిటిని ఏర్పాటు చేసుకున్నారు.ఇక్కడ కార్యక్రమాలను నిర్వహించుటకు కార్యాలయాన్ని ఏర్పాటు చేసి దానిని ఆదివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమాలకు నీలాద్రి వర్క్స్ కమిటి చైర్మెన్ కే.హేమాక్షి ఎఐటియుసి ఉమ్మడి జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి పి.మురళీలు హాజరయ్యారు.జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి,కే.రాధాకృష్ణలు హాజరై ఆచరణ ప్రణాళికలను రూపొందించారు. ఈ సందర్భంగా కమిటి గౌరవాధ్యక్షులుగా వైయస్‌మణి, అధ్యక్షులు సిహెచ్ శివయ్య కమిటి సభ్యులుగా ఎం.నారాయణ స్వామి, ఎస్ గోవర్ధన్, ఆర్.సత్యనారాయణ,జి.రాజగోపాల్‌రెడ్డి, టి.శ్రీనివాసులురెడ్డి, ఏ.వరప్రసాద్,జి.పుష్పరాజు,టి.బాబు,తిరుపతిగీత,పి.రాధా,ఎస్.రేష్మ,చిన్నపాపమ్మ,జ్యోతిఎన్నుకున్నారు.

## పాత నెల్లూరు బస్టాండు వద్ద గంధోత్సవం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని పాత నెల్లూరుబస్టాండు కూడలి వద్ద ఉన్న మహబూబ్‌సుబహాని ఖాదర్ వలి అల్లాహ్ వారి గంధోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హిందూముస్లిం తేడా లేకుండా కలసి మెలసి వలీ అల్లాహ్ వారి గంధోత్సవం జరిపారు. ఆదివారం వేలాది మందికి అన్నదానం జరిపారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా గరికపాటి రమేష్‌బాబు హాజరయ్యారు. కార్యక్రమాలను ఛోటా, నజీర్, సుబ్రమణ్యం, బాబుమేస్త్రీ, బాష, జయరామయ్య, శీను,సబ్రమణ్యం, జిలాని బాషాలు నిర్వహించారు.

## ఉచిత సోలార్ ప్యానల్ పథకం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఎస్‌సి,ఎస్‌టి విద్యుత్ వినియోగదారులకు పిఎం సోలార్ సూర్యఘూర్ ఉచిత సోలార్ ప్యానల్ పథకాన్ని అమలుకు సిద్దం చేస్తున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. నియోజకవర్గంలోని దళిత, గిరిజన రైతుల్ని ఆదుకొనుటకు ఈ పథకానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఎంఎల్‌ఏ సూచించారు. వినియోగదారుడు 2కే డబ్ల్యూ.పి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెల్‌ను కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సబ్సీడితో పూర్తిగా ఉచితంగా పొందవచ్చును. ఇది ఇప్పుడుమీరు వాకుంటున్న 200యూనిట్లు ఉచిత విద్యుత్ పథకానికి అదనంగా మీరు వాడుకొని మిగిలిన యూనిట్లుకు డిపార్టుమెంట్ వారు ఆ రోజు ఉన్న యూనిట్ రేట్లను బట్టి మీ ఖాతానందు డబ్బు జమచేయటం జరుగుతుందని వివరించారు. ఇది వినియోగ దారునికి అదనపు ఆదాయం సమకూరుస్తుంది. వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. 2 కెడబ్ల్యు కాంటాక్టు లోడ్ సోలార్ ప్యానల్ ఖర్చు రూ.1,50,000లు ప్రభుత్వమే పూర్తి సబ్సీడితో సోలార్ ప్యానల్‌ను బిగించటం జరుగుతుందని సుధీర్‌రెడ్డి వివరించారు.

## పౌరసరఫరాల పోటీల్లో ఊరందూరు విద్యార్థి జిల్లా ఫస్ట్



శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 22 ప్రభాతవార్త

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ నిర్వహించిన వినియోగదారుల సంరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు వాటి వినియోగం అనే అంశంపై తిరుపతిజిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 10 వ తరగతి చదివేవిద్యార్థి వై.జాహ్నవి మొదటి స్థానం సాధించింది. ఆ విద్యార్థిని ఆదివారం పాఠశాలలో సత్కరించారు. ఈ పోటీల్లో వ్యాసరచన పోటీలు, తెలుగుమీడియం,ఇంగ్లీష్‌మీడియం, వకృత్వపు పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయురాలు రాజకుమారి మాట్లాడుతూ వస్తువులు కొనేటప్పుడు అనేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐఎస్‌ఐ మార్కు, అగ్‌మార్కులనే గమనించి కొనుగోలు చేయాలన్నారు. కల్తీలకు లోనుకాకుండా, వినియోగదారుడు మోసపోకుండాజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన జాహ్నవి డిసెంబర్ 24న విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనటం తమ పాఠశాలకు మంచిపేరు తీసుకురావటం హర్షణీయం అన్నారు.ఈ కార్యక్రమాల్లో అవార్డు గ్రహీత కూనాటి సురేష్,రమేష్‌బాబు,శాంతి రజియా,సుమతి, మురళి, శ్రీనివాసులు,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి




పుత్తూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త :

భారతదేశ కీర్తి, ప్రతిష్టలను విశ్వ వ్యాప్తం చేసిన గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని జాతీయ గణిత దినోత్సవంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కాలేజీలో జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ గణిత శాస్త్రం అన్ని శాస్త్రాలకు తల్లి లాంటిదని, మానవ జీవితంలోని అనేక సమస్యలకు గణిత శాస్త్రం పరిష్కారం చూపుతోందని తెలిపారు. అనంతరం శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గణిత విభాగం అధ్యక్షులు డాక్టర్ పి.గాయత్రి, ఇంకా అధ్యాపకులు డాక్టర్ సి.నరసింహారెడ్డి, డాక్టర్ వసంత్, డాక్టర్ ఎస్.షర్మిల, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి ప్రభుత్వం క్రీడా కోటాను పెంచింది



ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

పుత్తూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త :

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ నియామకాలు, పోటీ పరీక్షలకు సంబంధించి రెండు శాతంగా వున్న క్రీడా కోటాను 3 శాతానికి పెంచిందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. ఆదివారం పట్టణంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్ 19 బాలబాలికల ఖోఖో క్రీడా పోటీల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తే ఇచ్చే ప్రోత్సాహకాలను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెంచారని తెలిపారు. అందువల్ల క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ వుంటుందన్నారు.అనంతరంఖోఖో బాలుర విజేత ప్రకాశం జిల్లా జట్టుకు, మిగిలిన విజేతలైన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## మాజీ జడ్పీటీసీకి నివాళులర్పించిన ఎమ్మెల్యే



విజయపురం, డిసెంబరు 22 ప్రభాతవార్త:

మండలంలోని జంబాడలో ఇటీవల మృతి చెందిన మాజీ జడ్పీటీసీ సుజాతమ్మ చిత్రపటానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. కర్మక్రియల సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్, టీడీపీ నాయకులు లక్ష్మీపతిరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## దళితుల ఇళ్లను కూల తోయడం అన్యాయం...



రేణిగుంట డిసెంబర్ 22 ప్రభాతవార్త

రేణిగుంట మండలం కుర్ర కాలవలో దళితులు కట్టుకున్న ఇళ్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి జెసిబితో కూలదోయడం అన్యాయమని దళిత సంఘాల నేతలు, బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులంతా గిరిజన సంఘం నేత హరినాథ్, అంబేద్కర్ సంఘం నేత నాగరాజులతో కలిసి కుర్ర కాలవ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో తాహసిల్దార్ సురేష్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అనంతరం కుర్ర కాలువ ఇళ్ళు పడగొట్టిన స్థలంలో అంబేద్కర్ విగ్రహం ముందు అంబేద్కర్ సంఘం నాయకులు నాగరాజు, గిరిజన సంఘం నాయకుడు హరినాథ్ మాట్లాడుతూ అర్ధరాత్రి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూల్చడం అన్యాయమన్నారు. కూడు గూడు కోసం అలమటించే నిరుపేద దళితుల ఇళ్లను ఎలా కులుస్తారంటూ ప్రశ్నించారు. ప్రభుత్వానికి అవసరమైతే ముందస్తు నోటీసులు ఇచ్చి ప్రత్యామ్నాయం చూపించి పడగొట్టాలి తప్ప ఇలా ఏకపక్షంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ భవనాన్ని ఎలా పడగొడతారని ఆగ్రహించారు. తమ వద్ద పట్టాలు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు తమ గుళ్ళు కూల్చారంటూ వాపోయారు. తక్షణం దళితులకు న్యాయం చేయాల ని రెవిన్యూ యంత్రాంగం తో పాటు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని వేడుకుంటున్నామన్నారు. నిరసన తెలియజేసి వినతి పత్రం సమర్పించిన వారిలో ఏపీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి హరి నాథ్, కెవిపిఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్, ఆదర్శ మాలల ఐక్యవేదిక తిరుపతి పార్లమెంటు ప్రెసి డెంట్ అంబేద్కర్‌నాగరాజు, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం మండల కార్యదర్శి ఈశ్వరమ్మ, బాధితులు ఉన్నారు.

## అక్రమణలపై రెవెన్యూ అధికారులు పంజా...



రేణిగుంట, డిసెంబర్ 22 ప్రభాతవార్త

రేణిగుంట మండలంలో జరిగిన పలు అక్రమ కట్టడాలపై శనివారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు పంజా విసిరి జెసిబి సహాయంతో ఇళ్లను తొలగించారు. మండలంలోని కుర్రకాలవ, జంగారెడ్డి పల్లె (బేరివాని గుంట), సూరప్పకసం ప్రాంతాలలో అక్రమంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇల్లు నిర్మించారని రెవెన్యూ అధికారులు పోలీసుల సాయంతో దాదాపు 150 ఇళ్లను తొలగించేశారు. శుక్రవారం రాత్రి ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టి తెల్లవారు జామున మూడు గంటల వరకు కొనసాగించారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం నేరమన్నారు. ప్రభుత్వ స్థలాలు జోలికి వస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

## రెవెన్యూ సదస్సులో పలు సమస్యలు పరిష్కారం



రేణిగుంట డిసెంబర్22ప్రభాతవార్త

రేణిగుంట మండలం కుర్ర కాలువ, కృష్ణయ్య కాలువలో శనివారం జరిగిన రెవిన్యూ సదస్సు నందు అనేక భూ సమస్యలు పరిష్కారం అయ్యాయి. కుర్ర కాలవ నందు ఒక పాఠశాల స్థలము, ఒక స్మశాన స్థలము, మూడు స్థలాలకు సంబంధించిన పట్టాలు, నాలుగు వెబ్లాంట్ ఆర్ఓఆర్ లు, కృష్ణయ్య కాలవలో రెండు వెబ్ ల్యాండ్ ఆర్ఓఆర్ లు రెండు ఇంటి స్థల పట్టాల సమస్యలు పరిష్కారమయ్యాయి. ఆక్రమణలో భాగంగా రెవెన్యూ అధికారులుఇంటినిర్మాణాలుతొలగించిననేపథ్యంలోబాధితులుఆందోళనచేస్తున్నప్పటికీ తహసిల్దార్ సురేష్‌బాబుచాకచక్యంగా వ్యవహరించి రెవెన్యూ సదస్సు సజావుగా జరిపి సమస్యలను పరిష్కరి ంచారు.

## ఘనంగా జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు..



రేణిగుంట డిసెంబర్ 22 ప్రభాతవార్త

వైసిపి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, జననేత జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని అక్షయ క్షేత్రంలో మండల వైసీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వైసిపి నేతలు వికలాంగుల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అక్షయ క్షేత్రంలోని ప్రత్యేక ప్రతిభావంతులకు బిస్కెట్లు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ హరి ప్రసాద్ రెడ్డి, ప్రజా నేత సిద్ధగుంట సుధాకర్ రెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిని జననేతగా అభివర్ణించారు. కార్యక్రమంలో సర్పంచులు గంగారి రమేష్, బాబ్జి రెడ్డి,వైసిపి సీనియర్ నేతలు జువ్వల దయాకర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, వైసిపి రేణిగుంట పట్టణ మైనార్టీ అధ్యక్షుడు రఫీ వల్ల, నాగరాజు, సైకిల్ షాప్ అలీ, పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా శారదా మాత జయంతి వేడుకలు



పాకాల, డిసెంబర్ 22, ప్రభాతవార్త

పాకాల స్థానిక రామకృష్ణ సేవా సమితి మందిరం నందు ఆదివారం ఘనంగా శ్రీ శారదామాత 172 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 5.30 గం.లకు శ్రీ శారదాదేవి అష్టోత్తర నామార్చన మరియు శ్రీ లలితా సహస్రనామార్చన జరిగినది. తదుపరి ఉదయము 11.00 లకు ముఖ్య అతిథిగా హాజరైన డా.ఎ. లీల, దివ్య, జనని శ్రీ శారదదేవి జీవితం గురించి బోధించారు. తదుపరి హాజరైన భక్తులకు మధ్యాహ్నం ప్రసాద వినియోగం జరిగినది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డా.ఎన్. సి. రామచంద్రా రెడ్డి, కార్యదర్శి మేజర్ పి. రవి నాయుడు, ఎన్. పరంధామ నాయుడు, సి. గురవయ్య నాయుడు, ఆనందాచారి, దొరస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జాతీయ పెన్షనర్స్ డే



పాకాల, డిసెంబర్ 22, ప్రభాతవార్త

పాకాలలో పెన్షనర్స్ దినోత్సవం ఆ సంఘ అధ్యక్షులు పి ఆర్ అధ్యక్షతన ఆదివారం ప్రభుత్వ బాలికల కళాశాల యందు ఘనంగా నిర్వహించారు. కేంద్ర,రాష్ట్రాల పెన్షనర్లు సకాలంలో పెన్షన్లు పొందుతూ ప్రశాంతంగా జీవనం గడపడం వెనుక విశేష కృషి సాధించిన డి ఎస్ నకారా చిత్రపటానికి పూలమాలవేసి అతిథులు అందరు కలసి నివాళులు అర్పించారు. పి ఆర్ మునస్వామి పెన్షనర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. సభకు ముఖ్య అతిథి విచ్చేసిన కె ఆర్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు పెన్షనర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. జయరాం నాయుడు పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, పెన్షనర్స్ పరిష్కారానికి కృషి చేయుచున్నారని తెలియజేసారు. ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వము వెంటనే 12వ పి ఆర్సి ఏర్పాటు చేసి ఐ ఆర్ 30 ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా 25 మంది సీనియర్ పెన్షనర్లకు సన్మానించారు.కార్యవర్గ సభ్యులు పెన్షనర్లు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండండి



సూళ్లూరుపేట, డిసెంబర్ 22 ప్రభాతవార్త : విద్యార్థులు మాదక ద్రవ్యాలపట్ల అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూళ్లూరుపేట ఎక్సైజ్ సిఐ కె.సురేంద్రబాబు అన్నారు. ఆదివారం సూళ్లూరుపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో వివిధప్రాంతాల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం పాత ముద్దాయిలుగా ఉన్న వారిని ఇళ్లలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు ఉన్నాయా అనే అంశంపై తనిఖీలు చేశారు. సూళ్లూరుపేట మండల పరిధిలోని సర్వారెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన దమాయి స్టాన్లీని పట్టుకొని అతని వద్ద అక్రమంగా ఉన్న 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సురేంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ బాలకృష్ణ, ఎస్ఐ ఎవి సురేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## 30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బాలాయపల్లి, డిసెంబర్ 22 ప్రభాతవార్త : ఈనెల 30వ తేదీ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో వినీల్ కుమార్ తెలిపారు. సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తారని చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

**ప్రజా విజ్ఞప్తుల దినం వాయిదా:**

ఈనెల 23వ తేదీ గూడూరులో జరగబోవు ప్రజా విజ్ఞప్తి దినాన్ని వాయిదా వేసినట్లు తాసిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మరలా ఎప్పుడు ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

## జలసిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీ ఏర్పాటు



వాకాడు, డిసెంబర్ 22, ప్రభాతవార్త: వాకాడు మండలం నెల్లిపూడి పంచాయితీ వెంకటరెడ్డి పాలెం గ్రామంలో వెలసిన శ్రీ కామాక్షిదేవి సమేత జలసిద్ధేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి ఆదివారం నూతన కమిటీ ఎన్నిక కావడం జరిగింది. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. అందులో కమిటీ ప్రెసిడెంటు వి. కస్తూరయ్య, వైస్ ప్రెసిడెంట్ కె.హరీష్, ఎం.కోటయ్య, ట్రెజరర్ సూరిశెట్టి, విజయ్ కుమార్, బాలు, మురళి, సభ్యులు వెంకటసుబ్బయ్య, జగన్, అనిల్‌రెడ్డి, తదితరులు ఎన్నికయ్యారు. భవిషత్‌లో ఆలయ అభివృద్ధికి కమిటీ పని చేస్తుందని ట్రెజరర్ విజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## కాణిపాకంకు పోటెత్తిన భక్తజనం

**-దర్శనానికి నాలుగు గంటల సమయం**



కాణిపాకం, డిసెంబర్ 22 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో జనసంద్రంగా మారింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజు ల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రంల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు శబరిమల, మేల్‌మరువత్తూర్, తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్ర దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

## గురూజీ ఆశ్రమంలో కేంద్ర మంత్రి



రామచంద్రాపురం, డిసెంబర్ 22 ప్రభాతవార్త: సి.రామాపురం సమీపంలోని శ్రీబ్రహ్మశ్రీ గురువానంద గురూజీ ఆశ్రమాన్ని ఆదివారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ సందర్శించారు. ఆశ్రమ నిర్వహకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆహ్వానించారు. ఆశ్రమంలో నిర్వహిస్తున్న అష్టలక్ష్మి ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురూజీ ఆశీర్వాదం పొందారు.

## కలంకారిపై విదేశీయుల మోజు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తిభావంతోవస్తున్న విదేశీ భక్తులు కలంకారిపై మక్కువ చూపుతున్నారు. కలంకారి కళకు పుట్టినిళ్ళుగా ఉన్న శ్రీకాళహస్తిలో కళాకారులు ప్రస్తుత సమాజ అభిలాషకు తగ్గట్టు మలుస్తున్నారు. ఆదివారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న అమెరికాకు చెందిన 20మంది భక్తులు శుకబ్రహ్మాశ్రమం సమీపంలోని 'భానోదయ కలంకారి' కేంద్రానికి వెళ్ళారు. అక్కడ చీరలు,దుప్పటాలు, షర్టులువారికికలంకారి కళాకారిణి పాలూరుపద్మావతి వివరించారు.

## పేరడం ప్రభుత్వ భూములపై కన్నేసిన భూ బకాసురులు

**ఆక్రమణల పరంపర కొనసాగుతున్నా చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు**



సత్యవేడు, డిసెంబరు 22 ప్రభాతవార్త: సత్యవేడు మండలం పేరడం గ్రామంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. గ్రామానికి ఎగువ భాగంలో ఉన్న ప్రభుత్వ భూములపై గ్రామంలో నివసిస్తున్న కొందరు కన్నేశారు. ఈ నేపథ్యంలోనే అడవి ప్రాంతానికి సమీపంలోని మేత పొరంబోకు సర్వే నెం.218లోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అందులో ఉన్న చెట్లను తొలగించి చదును చేయడంతోపాటు తాత్కాలిక షెడ్డు నిర్మిస్తున్నారు. ఇప్పటికే గ్రామానికి ఎగువ బాగాన ప్రభుత్వ స్థలాలు కొంత ఆక్రమణకు గురయ్యాయి. దీనిపై ఇంతకు ముందు తహసీల్దార్‌గాపని చేసిన షేక్ జరీనా హయాంలో గ్రామస్తుల నుంచి ఎన్నో ఫిర్యాదులు రెవెన్యూ అధికారులకు అందినా చర్యలు తీసుకోవడ ంలో విఫలమయ్యారు. ప్రస్తుత తహసీల్దార్ సుబ్రహ్మణ్యంని ఆసరా చేసుకుని ప్రస్తుతం కొందరు గ్రామస్తులు భూ బకాసురులుగా అవతారం ఎత్తారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ఇష్టానుసారం హద్దు అదుపు లేకుండా ఆక్రమించుకునే హద్దులు నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత వీఆర్‌వో, వీఆర్‌ఏ చోద్యం చూడడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా ఎవరు ఏం చేస్తారో అన్న భావన భూ ఆక్రమణ దారుల్లో పెరిగిపోవడం ఇందుకు కారణమని పలువురు భావిస్తున్నారు. ఇదేగాక భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ అధికారులు మెతక వైఖరి అవలంభించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## పురోభివృద్ధికి మూల స్తంభాలు ఉపాధ్యాయులే

**-యూటీయఫ్ స్వర్ణోత్సవ మహాసభలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి**



తిరుపతి విద్య డిసెంబర్ 22 ప్రభాతవార్త: శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకు పోతున్న భారత దేశంలో సామాజిక అభివృద్ధికి ఉపాధ్యాయులే మూల స్తంభాలుగా ఉంటున్నారని, వారి యొక్క సేవా తత్పరత, నిజాయితీ, విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఈరోజు సమాజాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో ఆంధ్ర ప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్, తిరుపతి జిల్లా శాఖ స్వర్ణోత్సవ మహాసభలు ఆ జిల్లా సంఘం అధ్యక్షులు జిజే రాజశేఖర్ అధ్యక్షతన ప్రారంభమ య్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చారిత్రిక నేపథ్యం, సామాజిక పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నారని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తన దృష్టికి తెచ్చారని, వాటి పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని, అలాగే ప్రాథమికస్థాయి నుండి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం కావడానికి ఉపాధ్యాయులు కూడా మరింత చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. పూర్వ శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్ర మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వ ల్లవిద్యావ్యవస్థ చిన్నాభిన్న మయ్యే పరిస్థితి వచ్చిందని,గత సంవత్సరాల నుండి ప్రభుత్వ పాఠశాలలో పిల్లల నమోదు తగ్గిపోతూ ఉందని,అనేక పాఠశాలలు మూత పడ్డాయని,వేలాది పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శేఖర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్యం సాధించడానికి విద్యావ్యవస్థలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్ ఎస్.నాయుడు, నవకోటేశ్వర రావు,జీ వి రమణ,జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మణికంఠం, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళిలు పాల్గొన్నారు.

## భక్తులకు మరింత సులభంగా వసతి సమాచారం

**-జిఎన్‌సి ఉప విచారణ కార్యాలయం ప్రారంభం**



తిరుమల,డిసెంబర్ 22ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది భక్తులకు సకాలంలో వసతి సమాచారం, గదులు పొందడం,ఖాళీచేయడం వంటి సమాచారం ఎప్పటికప్పుడు అందించేందుకు వీలుగా ఉప విచారణ కార్యాలయాలు అవసరం ఉంది. ఆధునీకరించిన జిఎన్‌సి ఉప విచారణ కార్యాలయాన్ని టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ శ్రీధర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఆర్ఓ డాక్టర్ తలారిరవి,డిప్యూటీ ఇఒ హరీంద్రనాథ్ పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



సూళ్లూరుపేట, డిసెంబర్ 22 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజకవర్గం పరిధిలోని నాయుడుపేట, ఓజిలి మండలాలకు చెందిన వేణుగోపాల్ నాయుడు, కస్తూరయ్య అనే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం నగదును చెక్కుల రూపేణా మంజూరు చేశారు. ఈ చెక్కులను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆదివారం వారి సంబంధీకులకు అందజేశారు. చిరువెళ్ల వేణుగోపాల్ నాయుడుకు ఒకలక్షా 26 వేల రూపాయలు, కస్తూరయ్యకు ఒక లక్షా 19 వేల రూపాయలు అందజేశారు.

## ఉపాధి హామీ పథకం ఏపీవోగా లక్ష్మినారాయణ

బాలాయపల్లి, డిసెంబర్ 22 ప్రభాతవార్త : మండల ఉపాధి హామీ పథకం ఇన్చార్జి ఏపివోగా లక్ష్మినారాయణ నియమిస్తూ పిడి సి.వి.ప్రసాద్ ఉత్తరాలు జారీ చేశారు. ఇక్కడ ఏపీవోభవన మృత్యుంజయను అన్నమయ్య జిల్లా కోడూరుకు బదిలీ చేశారు. లక్ష్మినారాయణ డక్కిలి మండల ఏపీవోగా పనిచేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

## వాహనాలు స్వాధీనం: సిఐ



వెంకటగిరి, డిసెంబర్ 22 ప్రభాతవార్త : జగనన్న కాలనీలో సర్కిల్ పోలీసులు కార్డినెంట్ సెర్చ్ ని నిర్వహించారు. తగు పత్రాలు లేకుండా ఉన్నందున 9 ద్విచక్ర వాహనాలు ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. జగనన్న లేఔట్లులో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం వస్తున్నందున ఇక్కడ తనిఖీలు నిర్వహించినట్లు సిఐ ఏవి రమణ తెలిపారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని వాటికి పత్రాలు చూపిస్తే విడుదల చేస్తామని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు ఏమన్నా ఉన్నాయా అని ఇళ్లల్లో పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, ఎస్ఐలు సుబ్బారావు, శివ శంకర్ రావు కామినేని గోపి సిబ్బంది పాల్గొన్నారు.

## 25న నవయాన బౌద్ధ ధర్మ స్వీకార మహోత్సవం



వెంకటగిరి, డిసెంబర్ 22 ప్రభాతవార్త : ఈనెల 25వ తేదీ ఏడిపిఎస్ ఆధ్వర్యంలో నవ యాన బౌద్ధ ధర్మ స్వీకార మహోత్సవం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏడిపిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇంగిలాల రామచంద్రరావు తెలిపారు. నవయాన బౌద్ధ ధర్మ శ్రీకార మహోత్సవ కరపత్రాలను ఆయన ఏడిపిఎస్ వద్ద కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25న నెల్లూరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో నవ యాన బౌద్ధ ధర్మ స్వీకార మహోత్సవం జరుగుతుందని తెలిపారు. దీక్ష భిక్షువు బంతేజి దమనంద, ముఖ్యఅతిథిగా ఏరా బోతూ సుబ్రహ్మణ్యం హాజరవు తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిపిఎస్ జిల్లా అధ్యక్షులు గుండవోలు గోపాలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగిటి వెంకటయ్య, నాయకులు గొల్ల గొడుగు శ్రీనివాసులు,అరవ హరి జై భీమ్, సాయికుమార్, రమేష్, చలపతి, వరకుమార్ కృష్ణయ్య,పెంచలయ్య, పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డిఎస్పి



కోట,డిసెంబర్ 22 ప్రభాతవార్త : సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు డిఎస్పి రమణ కుమార్ సూచించారు.ఆదివారం కోట పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన స్టేషన్‌లోని పలు కేసుల రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరిత గతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల ఒక్క ఫోన్ కాల్‌తో బ్యాంక్ ఖాతాలో డబ్బులను మాయం చేస్తున్నారని, వారి పట్ల ప్రజలు ఏంతో అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ఫోన్లుకు ఎటువంటి లింకులను తెరవద్దన్నారు. అవసరమైతే వెంటనే 1930 ఫోన్ చేస్తే వెంటనే పోలీసులు రంగంలోకి దిగుతారని చెప్పారు. యువత ప్రధానంగా చేడు మార్గం వైపు అడుగులు వేయకుండా ఉండాలని చెప్పారు. ఇందులో వారి తల్లిదండ్రులు కూడా వారి కుమారుల కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్‌ను తప్పని సరిగా దరించి డ్రైవింగ్ చేయాలన్నారు.

## మత ప్రచారంను అడ్డుకున్న బాజపా

కోట,డిసెంబర్ 22 ప్రభాతవార్త : కోట బిసి గురుకులంలో ఆదివారం మత ప్రచారం, ప్రార్ధనలను విద్యార్థులు చేత చేయిస్తున్నారని సమాచారం అందడంతో కోట మండల బాజాపా నాయకులు వెళ్లి అడ్డుకున్నారు. ప్రిన్సిపల్ నారాయణరావుతో మాట్లాడారు. విద్యార్ధుల పాఠాలు బోధించకుండా మతం పై ఏలా ప్రచారాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని మండల భాజపా అధ్యక్షులు డాక్టర్, సారంగం రమేష్ బాబు చెప్పారు.ఆయన వెంటవాసు సుబ్బారావు, వెంకయ్య వెంకటేశ్వర్లు ఉన్నారు.ప్రిన్సిపల్ నారాయణ రావును ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నింగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

## ప్రణాళికాబద్ధంగా ఫ్లెమింగో ఫెస్టివల్

**ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**

సూళ్లూరుపేట, డిసెంబర్ 22 ప్రభాతవార్త : సూళ్లూరుపేట కేంద్రంగా ఫ్లెమింగో ఫెస్టివల్‌ను జనవరి 10, 11, 12 తేదీల్లో నిర్వహించేందుకు సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించి ప్రతిపాదన సిద్ధం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి పంపినట్లు తెలిపారు. ఇందుకోసం 6 కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని, ఈ విషయంలో ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే పండుగ పనులను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేస్తామన్నారు. పండుగకు అధికారులు, ప్రజలు సహకరించాలని విజయశ్రీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, మాధవనాయుడు, బొమ్మన్ శ్రీధర్, బొమ్మన్ పళణి, ఎజి కిషోర్, విజయులునాయుడు, సంచి కృష్ణయ్య, వేమసాని శ్రీనివాసులునాయుడు, ప్రసాద్‌నాయుడు, కొక్కు శంకరయ్య, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

**వాస్తవాలు వక్రీకరించడం తగదు : ఎమ్మెల్యే**



వాస్తవాలను వక్రీకరించి ఒకరిపై అసత్య ప్రచారం చేయడం మంచిపద్ధతి కాదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ ఒక మీడియా పనిగట్టుకొని తమ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్‌పై అసత్య ప్రచారం చేస్తూ ఆయన ప్రతిష్టను కించపరిచేందుకు చూస్తుందని, ఇది సమంజసంగా లేదన్నారు. పార్టీలో ఆయన ఎటువంటి పదవులు కూడా ఆశించడం లేదని తెలిపారు.

## ముమ్మరంగా టిడిపి సభ్యత్వ నమోదు

సూళ్లూరుపేట, డిసెంబర్ 22 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మండల పరిధిలోని గోపాల్‌రెడ్డిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ముమ్మరంగా నిర్వహించారు. గోపాల్‌రెడ్డిపాలెం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.నిర్దేశించిన లక్ష్యాన్ని ఈనెల25వ తేదీలోగాపూర్తిచేస్తామని చంద్రారెడ్డి తెలిపారు.

## ఆర్‌వి సేవలు మరువలేం





కోట, డిసెంబర్ 22 ప్రభాతవార్త : దళిత ఉద్యమనేత, దివంగత ఆర్‌వి రమణయ్య పేద ప్రజల సమస్యలపై దశలవారీగా పోరాటాలు చేసి దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పలువురు విద్యావేత్తలు, దళిత సంఘాల నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం కోటలోని షాదీమంజిల్‌లో ఆర్‌వి రమణయ్య సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లోని పేదల భూములను ఆక్రమించుకొని సాగు చేసున్న భూస్వాములకు ఎదురొడ్డి ఆర్‌వి రమణయ్య నిలబడ్డారని చెప్పారు. ఈ సభలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి, బిటిఎఫ్, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

## అన్నదాతకు మరో అవకాశం

కోట, డిసెంబర్ 22 ప్రభాతవార్త : రబీ వ్యవసాయ సీజన్‌లో 2024-25కు సంబంధించి రైతులు సాగు చేసే వివిధ పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచిందని కోట మండల వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ చెప్పారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ వాస్తవంగా ఈ నెల 15వ తేదీలో గడువు ముగిసిందని చెప్పారు. అయితే అన్నదాతలకు ప్రయోజనం చేకూరాలన్న ఉద్దేశంతో ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు పెంచిందన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కోట,డిసెంబర్ 22 ప్రభాతవార్త : గూడూరులో సోమవారం కలెక్టర్ నేతృత్వంలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు అయినట్లు కోట మండల తహిశీల్దార్. కె.జయజయరావు తెలిపారు. ఆయన ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల కలెక్టర్ రావడం లేదన్నారు.మళ్లీ గూడూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎపుడు నిర్వహించేది తెలుపుతామన్నారు.

## బిజికెపాలెం రహదారి పునరుద్ధరణ



చిట్టమూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీరప్రాంత గ్రామమైన బురదగాలి కొత్తపాలెం పంచాయతీకి వెళ్లే గ్రావెల్ రోడ్డు గ్రామానికి సమీపంలో తెగిపోయింది. దీంతో ఆయా గ్రామాలకు గత వారంరోజులుగా రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. పంచాయతీ కార్యదర్శి జనార్ధన్, సర్పంచ్ యర్రబోతు మణి తూము కాలువను ఏర్పాటు చేసి రాకపోకలను పునరుద్ధరిం చడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. బురదగాలి, కొత్తపాలెం, కుమ్మరిపాలెం, పేరపాటితిప్ప తదితర గ్రామాలకు ఆదివారం నుంచి రాకపోకలు యధాతథం అయ్యాయి.

## ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానల్ పథకం

**- చిట్టమూరు విద్యుత్‌శాఖ ఏఇ పోలయ్య**

చిట్టమూరు, డిసెంబర్ 22 ప్రభాతవార్త : పీఎం సోలార్ సూర్య ఘర్ పథకంలో భాగంగా చిట్టమూరు మండలంలోని ఎస్సీ, ఎస్టీలకు 2కె డబ్ల్యుపి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు చిట్టమూరు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ పోలయ్య తెలిపారు. ఈ పథకంతో పాటు 200 యూనిట్లు ఉచిత పథకం అదనంగా పొందవచ్చని, మిగిలిన యూనిట్లకు విద్యుత్ శాఖ సోలార్ ప్యానల్ ద్వారా వచ్చిన యూనిట్లు రేటును బట్టి లబ్ధిదారుల ఖాతాలలో నగదు జమ చేస్తారని తెలిపారు. ఇంటి ఆదాతో పాటు అదనపు ఉత్పత్తి ద్వారా వినియోగదారులు లబ్ధి పొందవచ్చని ఆయన సూచించారు. పూర్తి ఉచితంగా అందిస్తున్న ఈ పథకం నమోదుకు విద్యుత్ శాఖ సిబ్బంది కలవాలని పోలయ్య సూచించారు.

## హైందవ సభను విజయవంతం చేయాలి

**ఎస్ఏఎస్ఎఫ్ రాష్ట్ర ధర్మప్రచారకుడు సాయిరాం**

వాకాడు, డిసెంబర్ 22 ప్రభాతవార్త : జనవరి 5వ తేదిన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ విశ్వ హింధూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభకు హింధువులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ధర్మప్రచారకుడు సాయిరాం, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు.వారు మండల పరిధిలోని నెల్లిపూడి దేశమ్మ ఆలయం లో హిందూ దైవ భక్తులతో మండల సమావేశం నిర్వహించారు. అలాగే హైందవ శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వతంత్రాన్ని పొంది 77 ఏళ్లు పూర్తి అయినా హిందువులకు మాత్రం తమ దేవాలయాలు తామే నిర్వహించుకునే స్వతంత్రత రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల ధర్మప్రచారకుడు విశ్వనాథం, వాకాడు మండల కన్వీనర్ కె. కొండయ్య, పంచాయితీ కన్వీనర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

## వరిలో తెల్లతెగులు... ఆందోళనలో అన్నదాతలు



నాయుడుపేట, డిసెంబర్ 22 ప్రభాతవార్త : రైతులు ఆరుగాలం కష్టపడి వేలకువేలు అప్పులు చేసి సాగుచేపట్టిన వరిపైరులో తెల్లతెగులు సోకడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నాయుడుపేట మండలంలో 8900 ఎకరాల్లో రైతులు వరిపైరును సాగుచేపట్టారు. అందులో ముఖ్యంగా బిపిటి జిలకర మసోర, కెఎన్ఎమ్,ఆర్ఎన్ఆర్‌లుతదితర కరాల వరి పంటను ఆదునిక పద్దతుల్లో రైతులు వ్యవసాయసాగు చేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈఏడాది అధికంగా వర్షాలు కురవడంతో వరిలో చీడిపీడల బెడద ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు.ముఖ్యంగా అన్నమేడు, మర్లపల్లి, విన్నమాల, పండ్లూరు,చిగురుపాడు,తిమ్మాజికండ్రిగ,మేనకూరు,బీమవరం,తదితర గ్రామాల్లో రైతులు సాగుచేపట్టిన వరిపైరులో తెల్లతెగుల బెడద అధికంగా ఉందని రైతులు చెప్తున్నారు.తెగులు నివారణకు మందులు వాడిన నివారణ కావడంలేదని అన్నదాలు ఆవేధన చెందుతున్నారు. ఈ విషయమై నాయుడుపేట వ్యవసాయాధికారి గణేష్‌ను వివరణ కోరగా ఆయన మాట్లడుతూ తుపాన్ ప్రభావంతో అధికవర్షాలు కురవడం పంటపొలాల్లో నీటిమట్టం అధికంగా నిల్వచేరడం కారణంగా చీడిపీడల బెడద ఎక్కువగా ఉందన్నారు.ముఖ్యంగా స్వర్ణముఖి,మామిడికాలువ పరివాహక గ్రామాల్లో సాగుచేపట్టిన పంటపొల్లాలో తెల్లతెగులు అధికంగా ఉందన్నారు.తెగులు నివారణకు పంటపొలాల్లో నీరునిల్వచేరకుండ తీసివేసి ముళ్ళమండితో వరిపైరుపై లాగిన తరువాత కొరాజిన్-60ఎమ్ఎల్ ఒకఎకరానికి లేదా కింగ్‌డాక్స్-150ఎమ్ఎల్ ఎకరానికి తగిన మోతాదులో కలిపి పిచికారి చేయడం ద్వార వరిలో తెల్లతెగులును నివారించవచ్చునని ఆయన తెలియజేశారు.

## నిజాయితీగా సర్వేచేసి...దోషులను శిక్షిస్తారా!

దొరవారిసత్రం నవంబర్ 22 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా,దొరవారిసత్రం మండలంలో మహాత్మాగాంధి ఉపాధిహామి పథకం ద్వారా కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం ప్రజలకు వినియోగించడం జరిగింది. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కేటాయించిన నిధులు లబ్దిదారులకు సక్రమంగాచేరాయా లేక గ్రామ స్థాయిలో ఫీల్డు అసిస్టేంట్లు,టెక్నికల్ అసిస్టేంట్లు తప్పుడు లెక్కలు చూపించి అక్రమాలకు పాల్పడుతున్నారా అని ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఆడిటింగు నిర్వహిస్తుంటారు. కాని గత ఐదు సంవత్సరాలుగా దొరవారిసత్రం మండల పరిధిలో ఎక్కడా సోసల్ ఆడిటింగ్ జరగలేదని,వచ్చిన అధికారులకు పెద్ద యెత్తున లంచాలు ముట్టజెప్పి గ్రాయ స్తాయిలో ఎక్కడా సోసల్ ఆడిటింగ్, సమగ్ర మెటీరియల్ ఆడిటింగ్ జరపలేదని మండలంలో పలువును వాపోతున్నారు. దొరవారిసత్రం మండలంలో మహాత్మాగాంధి ఉపాధిహామి పథకం క్రింద కోట్ల రూపాయలలో ఖర్చు చేసిన ప్రభుత్వ నిధులపై సమగ్ర ఆడిటింగ్ జరిపించాలని ప్రభుత్వం ప్రత్యేక ఆడిటింగ్ బృందాన్ని నియమించడం జకిగింది. ఈ బృందం దొరవారిసత్రం మండలం వచ్చి నాలుగు రోజులు అవుతున్నా గ్రామాలలో ఎక్కడా ఉపాధిహామి కూలీలతో గ్రామ సభలు నిర్వహించి సోషల్ ఆడిటింగ్ జరపట్లేదని పలువురు ఆరోపిస్తున్నారు. తప్పుచేసిన వారిపై సమగ్ర సర్వేచేసి ఈ ప్రభుత్వంలోనైనా చర్యలు తీసుకుంటారా లేక గత ప్రభుత్వంలో లాగా అవినీతిఫరులకు అండగా ఉంటారా అనితత పలువురు వాపోతున్నారు.

## ఎస్వీయూలో ఘనంగా రామానుజన్ జయంతి





తిరుపతి విద్య, డిసెంబర్ 22 ప్రభాతవార్త: గణిత శాస్త్ర అభివృద్ధికి శ్రీనివాస రామానుజం చేసిన సేవలు చిరస్మరణీయమని వీసీ సీహెచ్ అప్పారావు కొనియాడారు.ఎస్వీయూ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి పురస్కరించుకుని వర్సిటీలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత శాస్త్రమూ, దాని అనువర్తనాలు 2024 అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన రిజిస్ట్రార్ భూపతినాయుడతో కలసి ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్ర అభివృద్ధికి చేసిన సేవలు నిరుపమానం అనీ, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వర్సిటీ ప్రారంభంలో ఏర్పాటైన 6 విభాగాల్లో గణిత శాస్త్ర విభాగం ఒకటనీ, ఆ విభాగం నేటికి 70 సంవత్సరాలు పూర్తి చేసుకుందనీ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎన్ఐటీకి చెందిన ప్రొఫెసర్ జీ రాధకృష్ణమాచార్య,గణిత శాస్త్ర విభాగాధిపతి ఆచార్యా సి.జయ సుబ్బారెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ డి.భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు సుధాకరయ్య,సుగుణమ్మ,భారతి,రాజేష్ యాదవ్, వాసుదేవ రెడ్డి, విశ్రాంతాచార్యులు విజయకుమార్ వర్మ, శ్రీనాథ్,విశ్వనాథరెడ్డి,దేశ వ్యాప్తంగా వివిధ యూనివర్శిటీల నుంచి అధ్యాపకులు,పరిశోధకులు పాల్గొన్నారు.